
శాంతాక్లజ్‌ను పరిశీలిస్తున్న బాలుడు


క్రిస్మస్ పండుగ సామగ్రి కొనుగోళ్ల సందడి

# నీ రాక కోసం..

## క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన ప్రార్థనామందిరాలు

## పండుగ కొనుగోళ్లతో సందడిగా దుకాణాలు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో చర్చిలు అందంగా ముస్తాబవుతున్నాయి. విద్యుత్ దీప కాంతులతో మెరిసిపోతున్నాయి. పండుగ నేపథ్యంలో సోమవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో క్రిస్మస్ సామగ్రి కొనుగోళ్లతో దుకాణాలు సందడిగా మారాయి.

### రాయలసీమలోనే ఎత్తైన చర్చి

అనంతపురం నగరంలో పురాతన మందిరాల్లో ఒకటి అరవింద నగర్‌లోని సీఎస్‌ఐ హోలీ ట్రినిటి చర్చి. 1956లో ఈ ప్రాంతంలో ఎక్కువమంది క్రైస్తవులు నివాసముండేవారు. వీరంతా ప్రార్థనలకోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో 1957లో మోడరేటర్ సుమిత్ర చేతులమీదుగా ఈ ప్రాంతంలో చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. తొలినాళ్లలో చిన్నపాటి గోడలు నిర్మించి, అక్కడే ప్రార్థనలు చేసేవారు. తర్వాత రెవరెండ్ వ్యాండీబర్గ్ చొరవతో 1966లో చిన్నపాటి చర్చిని నిర్మించి ప్రారంభించారు. ఆతర్వాత 1992లో అప్పటి బిషప్ ఎల్‌వీ హజరయ్య చర్చి భవనాన్ని మరింత విస్తరించగా.. 2000 సంవత్సరంలో బిషప్ ఫ్రెడ్రిక్ ఆ నిర్మాణాన్ని సువిశాల భవనంగా తీర్చిదిద్దారు. అయితే ఏడాదికేడాది ఈ చర్చి సంఘంలో చేరే క్రైస్తవ కుటుంబాల సంఖ్య పెరుగుతూనే ఉంది. చర్చి ఆరంభ కాలంలో పదుల సంఖ్యలో కుటుంబాలు వచ్చి ప్రార్థనలు చేసుకుంటుండగా ప్రస్తుతం ఆ సంఖ్య 2వేలకు పైగా చేరింది. దీంతో చర్చిని మరింతగా విస్తరించడానికి చర్యలు చేపట్టారు. దాదాపు రూ.10కోట్ల వ్యయంతో రాయలసీమలోనే అత్యంత ఎత్తైన చర్చిగా, 54 అడుగుల ఎత్తుతో, ఏకకాలంలో 10వేల మందికి పైగా ప్రార్థనలు చేసుకునేలా సువిశాలమైన మందిరంగా తీర్చిదిద్దారు. 2023 ఏప్రిల్ 22న వైఎస్సార్ కడప జిల్లా సీఎస్‌ఐ సంఘ పీఠాధిపతి బిషప్ ఐజక్ వరప్రసాద్ చేతులమీదుగా నూతన చర్చి భవనాన్ని ప్రారంభింపజేశారు. కాగా చర్చి ఆధ్వర్యంలో సండే స్కూల్‌చిల్డ్రన్, యూత్ ఫెలోషిప్, ఉమెన్ ఫెలోషిప్ ఇలా మూడు ఉపసంఘాలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

● కాగా అరవిందనగర్‌లోని సీఎస్‌ఐ హోలీ ట్రినిటీ చర్చిలో సోమవారం రాత్రి జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రీక్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీ, ఎమ్మెల్యే, జడ్పీ ఛైర్‌పర్సన్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు హాజరయ్యారు.





కొవ్వొత్తులతో ప్రజాప్రతినిధులు, అధికారులు



### ఎస్‌ఐయూ టౌన్ కాంగ్రిగేషనల్ చర్చి

జిల్లాలో శతాబ్దానికి పైగా చరిత్ర గల ఏసు ప్రార్థనామందిరాల్లో టౌన్ కాంగ్రిగేషనల్ చర్చి(ఎస్‌ఐయూసీ) ఒకటి. జిల్లాకేంద్రంలోని సప్తగిరి సర్కిల్‌లో ఉన్న ఈ చర్చికి ఎంతో ప్రతిష్ఠ ఉంది. 1908లో లండన్ మిషనరీవారు ప్రార్థనలు చేసుకోడానికి ప్రస్తుత నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట చిన్నపాటి మందిరాన్ని నిర్మించారు. ఆనాటినుంచి ఈ ప్రాంతంలో సువార్తలు వ్యాపించడంతోపాటు క్రైస్తవ సంఘం ఏర్పడింది. తొలినాళ్లలో ఈ సంఘంలో 60 కుటుంబాలుండగా ప్రస్తుతం ఆ సంఖ్య వెయ్యికి పైగా పెరిగింది. 1995వ సంవత్సరంలో సంఘ సభ్యులు, భక్తుల సహకారంతో చర్చి భవనాన్ని విస్తరించి, చర్చికి ముందుభాగాన టవర్‌ను నిర్మించారు. చర్చి ఆవరణ అంతటా దేవుని సందేశాలతోనే కనిపిస్తుంది. 2012 నాటికి చర్చి నిర్మాణం సంపూర్ణమైంది. 2010 నుంచి రెవరెండ్ సంపత్ విజయ్‌కుమార్ చర్చిలో పాస్టర్‌గా వ్యవహరించడంతోపాటు చర్చి కమిటీ అధ్యక్షుడుగా సాగుతున్నారు.



### పరలోక మార్గానికి మార్గం ఏసు



మానవులను రక్షించడానికి లోక రక్షకుడుగా అవతరించిన ఏసు ఈ లోకంలో 30 సంవత్సరాలపాటు కుటుంబజీవితం సాగించారు. తదనంతరం మూడేళ్ల దేశసంచారంతో ఎన్నో అద్భుతాలు, మహిమలతో జనులకు స్వస్థత చేకూర్చారు. పరలోకానికి ఏగి, తిరిగి వచ్చి, తనను విశ్వసించిన ప్రతివారినీ పరలోక మార్గం చేర్చుటకు తానే మార్గమని ప్రకటించారు. అందుకే క్రిస్మస్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రైస్తవులందరికీ ప్రధాన పండుగ అయింది.

**- రెవ. బెన్‌హర్‌బాబు, సీఎస్‌ఐ చర్చి ప్రెస్బిటర్ ఇన్‌చార్జి, డివిజనల్ చైర్మన్**

### శాంతి సందేశమే క్రిస్మస్



సమాజంలోని ప్రజలందరికీ సంతోషం, శాతం, రక్షణ కల్పించడమే క్రిస్మస్ సారాంశం. ఏసుప్రభువు పరలోకాన్ని వీడి భూలోకానికి వచ్చింది పాపులను రక్షించడానికే. ఒకరికొకరు సహకరించుకున్నపుడే ఏసు ఆశయం నెరవేరుతుంది. చీకటి జీవితంలో వెలుగులు నింపేదిగా క్రిస్మస్‌ను అందరూ భావిస్తారు. పేద, ధనిక అన్నివర్గాలవారు ఆనందంగా జరుపుకోవాల్సిన వేడుక ఇది.

**-స్వామిదాస్, టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు**



తెగుళ్లతో తంటాలు..!

**ఎన్ని మందులు పిచికారీ చేసినా తగ్గని వైనం..**

**నాసిరకం మందులా..?**

**వాతావరణ ప్రభావమా..?**

6

# సారుగారి డ్రైవరు గారు !

- తహసీల్దార్ డ్రైవర్ దర్పం
- అధికారి కుర్చీ పక్కనే కూర్చుని సెల్‌ఫోన్‌లో కబుర్లు



పుట్లూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సారు గారి డ్రైవరు గారు మరి..! ఆమాత్రం దర్జా ఉంటుంది. సారు మండలానికి మేజిస్ట్రేట్ కాబట్టి తనది కూడా అదే స్థాయి అని అనుకున్నాడేమో అధికార దర్పం చూపాడు. దిలాసాగా సారు సీటు పక్కన కుర్చీలో కూర్చోని సెల్‌ఫోన్‌లో పిచ్చాపాటి మాటల్లో మునిగిపోయాడు. ఇదీ పుట్లూరు తహసీల్దార్ కార్యాలయం సోమవారం కనిపించిన పరిస్థితి. తహసీల్దార్ డ్రైవర్ ఆయన కుర్చీ పక్కనే ఉన్న మరో కుర్చీలో కూర్చొని ఓ అధికారి లెవల్లో ఫోజు కొట్టడం కనిపించింది. ఫోన్‌లో పిచ్చాపాటిగా మాట్లాడుతూ పెద్ద ఆఫీసర్ లెవల్లో స్టైల్ కొట్టాడు. సాధారణంగా సోమవారం కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించాల్సి ఉంది. రెవెన్యూ సదస్సుల కారణంగా వాయిదా వేశారు. దీంతో తహసీల్దార్ ఆయన గదిలోనే కూర్చొని సమస్యలను వింటున్నారు. కానీ డ్రైవర్ కూర్చొన్న గదిలోనే ప్రతి సోమవారం గ్రీవెన్స్ నిర్వహించేవారు. పలు సమస్యలపై కార్యాలయానికి వచ్చిన ప్రజలు అదే గదిలోకి వెళ్లి చూస్తున్నా ఆయన మాత్రం కుర్చీలో నుంచి దిగలేదు. ఎవరబ్బా..! ఈ ఆఫీసరు అని సమస్యలపై వచ్చిన ప్రజలు ఆరా తీశారు. డ్రైవర్ అని తెలుసుకుని ఔరా డ్రైవర్‌ది కూడా గవర్నమెంట్ ఆఫీసుల ఏమి దర్జానో అంటూ నిట్టూర్చారు.




బీజేపీది విభజనవాదం

**సమైక్యతతో తిప్పికొట్టాలి**

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై. వెంకటేశ్వరరావు**

7

# అయ్యయ్యో..!



- కొందరు టీచర్లను ముంచిన వైసీపీ ప్రభుత్వం
- ఎన్నికల ముందు అడ్డగోలుగా సిఫార్సు బదిలీలు
- రూ.మూడు లక్షల నుంచి రూ. ఐదు లక్షల వరకూ వసూలు
- సిఫార్సు బదిలీలను రద్దు చేసిన కూటమి సర్కార్
- కోర్టుకెళ్లినా... నిష్ప్రయోజనం
- ఆవేదనలో నష్టపోయిన ఉపాధ్యాయులు


జిల్లా విద్యాశాఖ కార్యాలయం

అనంతపురం విద్య, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అడ్డదారుల్లో వెళ్లిన కొందరు ఉపాధ్యాయులు నిండా మునిగిపోయారు. వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర వైసీపీ ఉపాధ్యాయ సంఘాల నేతలను నమ్ముకుని సిఫార్సు బదిలీలకు భారీగానే ఖర్చు పెట్టుకున్నారు. కొందరు రూ.మూడు లక్షలు ఇస్తే... మరికొందరు రూ. ఐదు లక్షలు కూడా ముచ్చజెప్పారు. దీంతో ఎన్నికల ముందు హడావుడిగా ఉపాధ్యాయుల బదిలీల ఆర్డర్లు బయటికొచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1200 నుంచి 1400 వరకూ బదిలీలు చేసినట్టు అప్పట్లో ప్రచారం సాగింది. ఈ క్రమంలో అనంతపురం జిల్లాలో సైతం భారీగానే ఉపాధ్యాయుల బదిలీల ఆర్డర్లు వచ్చాయి. ఎన్నికల్లో లబ్ధిపొందడానికే వైసీపీ ఎన్నికల ముందు ఈ దొడ్డిదారి బదిలీలు చేసిందంటూ కొందరు ఉపాధ్యాయ సంఘాల నేతలు, మేధావులు ఎన్నికల కమిషన్, విద్యాశాఖకు ఫిర్యాదు చేశారు. ఇంతలోనే ఎన్నికలు పూర్తి కావడం, కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో అడ్డగోలు బదిలీ ఆర్డర్లుకు బ్రేక్ వేశారు. దీనిపై కొందరు కోర్టును ఆశ్రయించినా ఫలితం లేకుండా పోయింది.

### బదిలీల కోసం లక్షల్లో వసూలు

రాష్ట్రంలో ఎన్నికల ముంగిట నిబంధనలను తుంగలో తొక్కి కోరుకున్నోళ్లకు కోరుకున్న చోటుకు అన్నట్లుగా బదిలీ ఉత్తర్వులిచ్చారు. ఈ క్రమంలో అప్పటి వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, వాళ్ల పేర్లు చెప్పి కొందరు వైసీపీ నాయకులు, కొన్ని ఉపాధ్యాయ సంఘాల నేతలు ఎడాపెడా లక్షల్లో వసూళ్లు చేశారు. కొందరు నేరుగా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేల దగ్గర పనిచేసే వాళ్లే వసూలు చేశారు. మరికొందరు ఉపాధ్యాయ సంఘాల నేతల చేతుల మీదుగా వసూలు చేసి తతంగం నడిపారు. ఆగమేఘాల మీద బదిలీ ఆర్డర్లు ఇప్పించి, ఎన్నికల ముందు భారీగా సొమ్ము చేసుకున్నారు. బదిలీలు లేని సమయంలో ఈ బదిలీ ఉత్తర్వులు బయటకు రావడంతో ఇదంతా ఎన్నికల్లో వైసీపీకి లబ్ధి చేకూర్చడానికేనంటూ మెజార్టీ ఉపాధ్యాయ సంఘాల నేతలు విమర్శించారు. వాటిని రద్దు చేయాలంటూ అప్పట్లో కమిషనర్, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లారు.

### నీరుగారిన ఉత్సాహం

వైసీపీ ప్రభుత్వంలో డబ్బులిస్తే ఎక్కడికైనా బదిలీ ఉత్తర్వులు వస్తాయంటూ ఉత్సాహపడ్డారు. పైరవీకారులు అడిగినంతా ఇచ్చి అనుకూలమైన ప్లేసులు తెచ్చుకున్నారు. పోటాపోటీగా క్యూ కట్టి ఒక్కోరు రెండు, మూడు ఉత్తర్వులు కూడా తెచ్చుకున్నారు. రాష్ట్ర విద్యాశాఖాధికారులు సైతం అడ్డదిడ్డంగా ఒక ప్లేస్‌కే ఇద్దరు, ముగ్గురు టీచర్లకు సైతం ఉత్తర్వులు ఇచ్చారు. అప్పుడు ఉత్సాహంగా పోటీ పడిన టీచర్లు ప్రస్తుతం నిరుత్సాహంతో నిట్టూరుస్తున్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఆ ఉత్తర్వులను రద్దు చేసింది. వాళ్లు కోర్టును ఆశ్రయించినా ఫలితం లేకుండాపోయింది. మెడికల్ గ్రౌండ్స్ కింద, ఇతర కారణాలు చూపుతూ దొడ్డిదారిన బదిలీల ఉత్తర్వులు పొందాలని చూశారు. మెడికల్ సమస్యలుంటే మెడికల్ లీవ్‌లో వెళ్లండి. అంతేకానీ సిఫార్సు బదిలీ చేసేందుకు సాధ్యపడదు. ఆ బదిలీలు చేయలేం, వచ్చే బదిలీల్లో కౌన్సెలింగ్‌కు హాజరుకండి అంటూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేయాలంటూ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆదేశాలు జారీ చేశారు. దీంతో బదిలీల కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేసిన పలువురు టీచర్లు గగ్గోలు పెడుతున్నారు. ఇది విన్న తోటి టీచర్లు, సంఘాల నేతలు టీచర్లను సైతం వైసీపీ నిండా ముంచేసిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

| ఉపాధ్యాయుడి పేరు | కేటగిరీ | సబ్జెక్టు | బదిలీ ఉత్తర్వులు తెచ్చుకున్న స్థానం |
|---|---|---|---|
| 1.మల్రిస్వామి | ప్రైమరీ | హెచ్‌ఎం | ఎంపీపీ స్కూల్, ఏ. నారాయణపురం, అనంతపురం రూరల్ |
| 2.చార్లెస్ | స్కూల్ అసిస్టెంట్ | ఇంగ్లిష్ | ఎంపీయూపీ స్కూల్, కొజ్జేపల్లి, గుత్తి మండలం |
| 3.లక్ష్మిదేవి | స్కూల్ అసిస్టెంట్ | బయాలజీ | జడ్పీహెచ్‌ఎస్, ఉబ్బరవాండ్లపల్లి, తలుపుల మండలం |
| 4.లలితమ్మ | ప్రైమరీ స్కూల్ | హెచ్‌ఎం | ఎంపీపీ స్కూల్, కదిరికొండ, గుత్తి మండలం |
| 5.సుమంగళమ్మ | స్కూల్ అసిస్టెంట్ | ఇంగ్లిష్ | ఎంపీయూపీ స్కూల్, చోళసముద్రం, కూడేరు మండలం |
| 6.మైథిలి | స్కూల్ అసిస్టెంట్ | సోషల్ | జడ్పీహెచ్‌ఎస్, తపోవన్‌నగర్, అనంతపురం |
| 7.బషీరున్ బేగం | స్కూల్ అసిస్టెంట్ | హిందీ | జడ్పీహెచ్‌ఎస్, కడవకల్, పుట్లూరు మండలం |
| 8.అనిత | స్కూల్ అసిస్టెంట్ | హిందీ | ఎంపీయూపీ స్కూల్, ఈదులముస్టూరు, బత్తలపల్లి మండలం |
| 9.శివయ్య | స్కూల్ అసిస్టెంట్ | సోషల్ | జడ్పీహెచ్‌ఎస్, కమ్మూరు, కూడేరు మండలం |
| 10.నాగిరెడ్డి | స్కూల్ అసిస్టెంట్ | ఇంగ్లిష్ | ఎంపీయూపీ స్కూల్, ఇప్పేరు, కూడేరు మండలం |
| 11.మహేష్‌కుమార్ | స్కూల్ అసిస్టెంట్ | ఫిజికల్ సైన్స్ | ఎంపీయూపీ స్కూల్ ఉదిరిపికొండ, కూడేరు మండలం |
| 12.హేమావతి | స్కూల్ అసిస్టెంట్ | ఇంగ్లిష్ | ఎంపీయూపీ స్కూల్, ఇప్పేరు, కూడేరు మండలం |
| 13.ధనుంజనేయులు | స్కూల్ అసిస్టెంట్ | ఇంగ్లిష్ | ఎంపీయూపీ స్కూల్, చెన్నంపల్లి, బీకేఎస్ మండలం |
| 14.శ్యామల కుమారి | స్కూల్ అసిస్టెంట్ | గణితం | జడ్పీహైస్కూల్, నల్లగుట్లపల్లి, తనకల్లు మండలం |
| 15.లక్ష్మీదేవి | ఎస్‌జీటీ | | ఎంపీపీ స్కూల్, కోటంక, గార్లదిన్నె మండలం |
| 16. సోమశేఖర్ | ఎస్‌జీటీ | | ఎంపీపీ స్కూల్, ఇందిరానగర్, ఉరవకొండ మండలం |

# ఏం చేస్తున్నారు..?

- చదువు చెప్పే చోట గంజాయా..?
- పిల్లలేంచేస్తున్నారో గమనించలేరా?
- తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యాలకు ఎస్పీ క్లాస్
- గంజాయితో సంబంధమున్న విద్యార్థులకు కౌన్సెలింగ్



అనంతపురం క్రైం,డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చదువు చెప్పే చోట గంజాయి గురించి ప్రస్తావించాల్సి వస్తోంది..? మీ మేనేజ్‌మెంట్ ఏం చేస్తోంది..?అలాగే మీ పిల్లలు ఎలా ప్రవర్తిస్తున్నారో గమనించలేరా అంటూ కళాశాలల యజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులను జిల్లా ఎస్పీ జగదీష్ మందలించారు. నగరంలోని ఐదారు కళాశాలల నుంచి గంజాయితో సంబంధమున్న 10మంది విద్యార్థులను, వారి యాజమాన్యం, తల్లిదండ్రులను సోమవారం పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. చదువుకోవాల్సిన వయసులో ఇలాంటి వ్యసనాలకు బానిసలై జీవితం నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. గంజాయి కేసు పడిందంటే జీవితం అంధకారం అవుతుందని హెచ్చరించారు. కళాశాలల్లో ఏం జరుగుతోందో గమనించకుండా ఏం చేస్తున్నారని సంబంధిత కళాశాలల యాజమాన్య ప్రతినిధులపై సీరియస్ అయ్యారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు నిఘా ఉంచాలన్నారు. గంజాయి వాడుతున్న పిల్లల్లో మార్పులొస్తాయన్నారు. వారు ప్రవర్తించే విధానమే తెలిసిపోతుందన్నారు. వారికి భవిష్యత్తు ఉంది కాబట్టి వదిలేస్తున్నామని, మరో సారి బయట పడితే కేసు నమోదు చేయాల్సి ఉంటుందని ఎస్పీ గట్టిగా హెచ్చరించారు.

# ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి: కాలవ


వినతిపత్రం అందిస్తున్న కాలవ

రాయదుర్గం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గార్మెంట్స్ రంగ పురోభివృద్ధికి ఎగుమతుల్లో వేగం పెరిగేలా రాయదుర్గం మీదుగా వెళుతున్న టాటానగర్, మైసూర్, వారణాసి, జైపూర్, యశ్వంత్‌పూర్ రైళ్లను రాయదుర్గం స్టేషన్‌లో ఆగేలా ఉత్తర్వులు ఇవ్వాలని కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్నను ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు కోరారు. ఆయన సోమవారం కర్ణాటకలోని తుంకూరులో క్యాంపు కార్యాలయంలో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. తెలుగుదేశం పాలనలో తాను మంత్రిగా ఉన్నపుడు అనంతపురం, కణేకల్లు రహదారుల్లో రెండు రైల్వే వంతెనల పనులను ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం అవి అసంపూర్తిగా ఉన్నాయన్నారు. నిలిచిపోయిన వంతెనలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. రాయదుర్గం నుంచి బళ్లారికి నిత్యం వాహన రాకపోకలు ఎక్కువగా ఉంటాయని చదం సమీపంలోని రైల్వేగేట్ వద్ద నూతన వంతెన నిర్మాణం అవసరముందన్నారు. అలాగే రాయదుర్గం-గుమ్మఘట్ట రహదారిలో పట్టణ శివారులో మరో వంతెనను నిర్మించాలని ఆయన మంత్రిని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు కాలవ తెలిపారు.

# తెగుళ్లతో... తంటాలు..!


టమోటా కాయలపై ఏర్పడిన మచ్చ తెగులు

- ఎన్ని మందులు పిచికారీ చేసినా తగ్గని వైనం
- నాసిరకం మందులా..? వాతావరణ ప్రభావమా...?
- పంటలను కాపాడుకోవడానికి రైతుల అవస్థలు


బూడిద, మచ్చతెగుళ్లు సోకిన బీరపంట

కళ్యాణదుర్గం/కుందుర్పి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బోరు బావుల కింద లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తున్న రైతన్నలను తెగుళ్ల బెడద పీడిస్తోంది. ఎన్ని మందులు పిచికారి చేసినా తెగుళ్లు తగ్గడం లేదు. దీంతో అన్నదాతలు ఆర్థికంగా కుదేలవుతున్నారు. నాసిరకం మందులు కారణమా.. వాతావరణంలో మార్పుల ప్రభావమా అనేది అంతుచిక్కడం లేదు. పంటలకు పెట్టిన పెట్టుబడులు కూడా రాక రైతులు నలిగిపోతున్నారు. కర్భూజ, కళింగర, టమోటా, బీర, మిరప, మామిడి, వేరుశనగ పంటలు ఎక్కువగా సాగు చేశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 800 ఎకరాలకు పైబడి ఈ పంటలన్నీ సాగు చేశారు. ఈసారి ఎక్కువగా టమోటా, వేరుశనగ పంటలను సాగు చేశారు. మచ్చతెగుళ్లతో టమోటా పూతంతా రాలిపోయింది. పూతను దక్కించుకోవడానికి ఎన్ని మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. బీరకాయ పంటకు కూడా మచ్చతెగులు సోకి ఆకులన్నీ ఎరుపు రంగులోకి మారిపోయాయి. వేరుశనగ పంట ఊడలు దిగే సమయానికి బూడిద తెగుళ్లు, నల్లజీడ, పచ్చపురుగు వచ్చి దిగుబడులపై పూర్తిగా ప్రభావం చూపుతోంది. మామిడికి పూత రాలిపోవడం, అగ్గితెగుళ్లు సోకి పంట ఎదుగుదల లేకపోవడంతో పంటను కాపాడుకోలేక పోతున్నారు. దీంతో పాటు మంచు కూడా విపరీతంగా కురవడంతో పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఒక్కోసారి మందును పిచికారి చేయాలంటే ఎకరాకు సుమారు రూ. 10 వేల దాకా ఖర్చు రావడంతో రైతులు భయపడుతున్నారు. తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించాల్సిన ఉద్యాన, వ్యవసాయ శాఖాధికారులు పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు.


తేనెబంకతో రాలిపోయిన మామిడి పూత, పిందె

### అదుపులోకి రాని తెగుళ్లు



నాకున్న 8 ఎకరాల్లో మామిడి పంటను సాగు చేశాను. వేలాది రూపాయలు ఖర్చు చేసి మందులు పిచికారి చేసినా తెగుళ్లు అదుపులోకి రావడం లేదు. పూత రాలిపోవడం, పిందె దశలో ఊడిపోవడం, బూడిద తెగుళ్లు ఇలాంటి తెగుళ్లు సోకి తీవ్రంగా నష్టపోతున్నాం.

**-ఆవునీరు, కరిగానిపల్లి, కుందుర్పి మండలం**

### పంటలను కాపాడుకోలేకపోతున్నా



నాకున్న 8 ఎకరాల్లో విడతల వారిగా వేరుశనగ, టమోటా పంటలను సాగు చేశాను. తెగుళ్లు భారీగా సోకడంతో పంటలను కాపాడుకోలేకపోతున్నారు. ఉదయం పూట పంటలపై తీవ్రమైన మంచు కురుస్తోంది. దీంతో పంటలకు ఎదుగుదల లేదు. ఆర్థికంగా నష్టపోతున్నాం. బూడిద తెగుళ్లు, మచ్చ తెగుళ్లతో నలిగిపోతున్నాం.

**- గౌసిద్ధ, కరిగానిపల్లి, కుందుర్పి మండలం**

### పంటను తొలగించేశా



నాకున్న రెండు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశాను. దీనికి సుమారు రూ. 60 వేలకు పైబడి ఖర్చు చేశాను. పంట ఏ మాత్రం ఎదుగుదల లేదు. పంటను కాపాడుకోవడానికి ఎన్ని మందులు పిచికారి చేసినా ప్రయోజనం కనిపించలేదు. తెగుళ్ల ఉధృతికి రెండు ఎకరాల్లో సాగు చేసిన వేరుశనగ పంటను తొలగించేశాను.

**- మహేష్, కరిగానిపల్లి, కుందుర్పి మండలం**

### నల్లమచ్చ తెగులుతో నష్టపోయా..



నాకున్న 8 ఎకరాల్లో విడతల వారిగా టమోటా, వేరుశనగ పంటలను సాగు చేశాను. లక్షలాది రూపాయాలు పెట్టుబడులు పెట్టాను. టమోటాకు మచ్చ, బూడిద తెగుళ్లు ఎక్కువగా సోకుతున్నాయి. అగ్గితెగుళ్లు, నల్లజీడ, పచ్చపురుగు ఉధృతంగా వ్యాపిస్తున్నాయి. పంటలను ఎలా కాపాడుకోవాలో తెలియని పరిస్థితుల్లో ఉన్నాను.

**- శ్రీనివాసులు, కరిగానిపల్లి, కుందుర్పి మండలం**

## న్యూస్ బాక్స్

### మున్సిపల్ టీచర్లకు కౌన్సెలింగ్

అనంతపురం విద్య, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్, నగరపాలక సంస్థ స్కూళ్లలో ఖాళీగా ఉన్న 26 పోస్టులను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయడానికి సోమవారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. అర్హులైన టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మున్సిపల్ స్కూళ్ల నుంచి వచ్చిన టీచర్లకు డీఈఓ ఆఫీస్‌లో వెరిఫికేషన్ నిర్వహించారు. నగరపాలక సంస్థలో స్కూల్ అసిస్టెంట్స్ గణితం-1, ఫిజికల్ సైన్స్-1, బయాలజీ-1, సోషియల్-1 పోస్టు, పీఎస్ హెచ్‌ఎం-2, మున్సిపాలిటీల్లో స్కూల్ అసిస్టెంట్స్ గణితం తెలుగు మీడియంలో-1, ఉర్దూ మీడియంలో -1, ఫిజికల్ సైన్స్ 2, బయాలజీ-2, సోషియల్-4, పీడీలు-5, పీఎస్ హెచ్‌ఎం-5 పోస్టులు ఖాళీ ఉన్నాయి. ఫైనల్ సీనియారిటీ జాబితాలోని అర్హులైన ఎస్‌జీటీల్లో 1:5 నిష్పత్తిలో టీచర్లను వెరిఫికేషన్‌కు పిలిచి, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. అనంతరం రాత్రివరకూ టీచర్లకు పోస్టింగ్ కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు.

### రాయలచెరువుకు నీటి విడుదల


నీటిని విడుదల చేస్తున్న జేసీ అస్మిత్‌రెడ్డి

పెద్దవడుగూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కదరగుట్టపల్లి రెగ్యులేటర్ ద్వారా రాయలచెరువుకు తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి సోమవారం నీటిని విడుదల చేశారు. రాయలచెరువును నీటితో నింపడం వల్ల పరిసర గ్రామాల్లో భూగర్భజలాలు పెరుగుతాయని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం కార్యకర్తలో సమావేశమయ్యారు. వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, యాడికి మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, చిరంజీవులు, దస్తగిరి, నాగరాజు కార్యకర్తలు పాల్గొన్నారు.

### సార్..! న్యాయం చేయండి

- వైద్యమంత్రికి తొలగించబడిన హెల్త్ అసిస్టెంట్ల వినతి

అనంతపురం టౌన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): 'కొన్నేళ్లుగా వైద్యశాఖలో పని చేస్తున్నాం. ఇపుడు కోర్టు ఉత్తర్వులు పేరుతో మమ్మల్ని తొలగించారు, మాకడుపు కొట్టకుండా మీరే న్యాయం చేయాలి' అని వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్‌యాదవ్ ఎదుట తొలగించిన హెల్త్ అసిస్టెంట్‌లు వేడుకున్నారు. కోర్టు ఉత్తర్వులతో వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఉమ్మడి జిల్లాలో 58మంది హెల్త్ అసిస్టెంట్‌లను ఈనెల 5న తొలగించారు. దీంతో సోమవారం ధర్మవరంలో మంత్రి సత్యకుమార్, టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌ను బాధిత హెల్త్ అసిస్టెంట్‌లు కలిశారు. వారు మాట్లాడుతూ.. 2002 నోటిఫికేషన్‌లో తాము పోటీ పరీక్షలు రాశామన్నారు. వివిధ కారణాలతో పోస్టులు భర్తీ చేయకుండా పెండింగ్‌లో పెడుతూ వచ్చారన్నారు. అయితే తాము కోర్టుకు వెళ్లి పోస్టులు తెచ్చుకొని 2016జాయిన్ అయ్యామన్నారు. ఇపుడు మళ్లీ కోర్టు ఉత్తర్వులు అంటూ మమ్మల్ని ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. అందరూ 50ఏళ్లు పైబడినవారే ఉన్నామని, ఉద్యోగాలనుంచి తొలగించడం వల్ల మాకుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిభ ఉన్న వారందరిని ఉద్యోగాల్లో కొనసాగించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. చట్ట ప్రకారం న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని బాధితులు తెలిపారు. కార్యక్రమంలో బాధితులు అజీజ్, మురళీమోహన్, బాబాఫక్రుద్దీన్, మల్లికార్జున, తిమ్మప్ప, చౌడయ్యతోపాటు పలువురు పాల్గొన్నారు.

# గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు

- జాతీయ రైతు దినోత్సవంలో ఎంపీ అంబికా


రైతును సన్మానిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని, అన్నదాతలే ఆ గ్రామాలకు ఊపిరి అని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఏఎఫ్ ఎకాలజీ సెంటర్, రైతుసంఘాలు, సహాయ రైతు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానికంగా ఓ ప్రైవేట్‌హాల్‌లో జాతీయ రైతు దినోత్సవ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ సృష్టిలో భూమిపై సమస్త జీవరాశులు ఆరోగ్యంగా జీవించడానికి అన్నదాతల శ్రమే ప్రధాన కారణమన్నారు. అలాంటి రైతులు బాగుంటేనే గ్రామం, ప్రాంతం, రాష్ట్రం, దేశం బాగుంటుందని తెలిపారు. కిసాన్ రైలు కోసం ప్రయత్నిస్తున్నామని, ఇటీవల తాడిపత్రి నుంచి అరటి పంటను రైలు ద్వారా విదేశాలకు తరలించామన్నారు. ఇదంతా అధికారులు, నాయకుల సహకారంతో సాధ్యమైందని తెలిపారు. ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి మాట్లాడుతూ కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రజలంతా ఇళ్లకే పరిమితమైన సమయంలోనూ రైతులు మాత్రమే వ్యవసాయం చేసి ప్రజలకు ఆహారాన్ని అందించారని గుర్తుచేశారు. రైతుసంఘం నాయకులు నరేంద్రస్వరూప్ మాట్లాడుతూ రైతు సహకార వేదిక రైతులకు ఎంతగానో ఉపయోగపడుతోందని తెలిపారు. విద్యుత్తు ప్రమాదంలో మరణించిన రైతుకుటుంబాల సహాయ నిధికి హార్టికల్చర్ రైతుసంఘం నాయకులు భాస్కర్ రూ.25వేలు అందజేశారు. అనంతరం ఆదర్శరైతులు 60మందిని రైతురత్న బిరుదుతో సన్మానించారు. అక్కడే రైతు ఉత్పత్తుల స్టాల్స్‌ను ఎంపి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెడ్స్ సంస్థ వ్యవస్థాపకురాలు భానుజా, రైతు సంఘాల నాయకులు, ప్రముఖులు, శాస్త్రవేత్తలు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు, యువరైతులు, తదితరులు పాల్గొన్నారు.

# విజేతలు ఏఎస్‌ఏ, నార్పల

- ముగిసిన రూరల్ క్రికెట్ లీగ్ పోటీలు



విజేతగా నిలిచిన అనంత స్పోర్ట్స్ అకాడమీ బాలికల జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రూరల్ క్రికెట్ లీగ్ పోటీల్లో బాలుర విభాగంలో నార్పల, బాలికల విభాగంలో అనంత స్పోర్ట్స్ అకాడమీ(ఏఎస్‌ఏ) జట్లు విజేతలుగా నిలిచాయి. జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో బాలుర-15, బాలికల అండర్-16 రూరల్ క్రికెట్ లీగ్ ఫైనల్స్ నిర్వహించారు. బాలుర పోటీల్లో ధర్మవరం, నార్పల జట్లు తలపడ్డాయి. నార్పల 34.3ఓవర్లలో 135పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్ సంజయ్ 58పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన ధర్మవరం 29.2ఓవర్లలో 69పరుగులకే ఆలౌట్ అయ్యింది. నార్పల బౌలర్లు వర్మేశ్వర్ 3, మహేంద్ర 3, కౌశిక్ 2 వికెట్లు పడగొట్టారు.

- బాలికల పోటీల్లో ధర్మవరం, అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్లు తలపడ్డాయి.



రూరల్‌లీగ్ క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన నార్పల జట్టు

ఏఎస్‌ఏ 30ఓవర్లలో 4వికెట్లు నష్టానికి 196పరుగులు చేసింది. బ్యాటర్లు ధారా మోహన్ 81, చైత్ర 40, రోషనారా 29 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన ధర్మవరం 30ఓవర్లలో ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 147పరుగులు మాత్రమే సాధించింది. బాలికల్లో బెస్ట్ బ్యాటర్ తేజశ్రీ శర్మ-543 (నార్పల), బెస్ట్ బౌలర్ జాహ్నవి-21 వికెట్లు (గుంతకల్లు), మోస్ట్ వ్యాల్యుబుల్ ప్లేయర్ హస్మిత 393పరుగులు, 12వికెట్లు (ధర్మవరం), ఎమర్జింగ్ ప్లేయర్ చైత్ర-476పరుగులు (ఏఎస్‌ఏ)లు నిలిచారు. బాలురలో బెస్ట్ బ్యాటర్ కౌశిక్-707 పరుగులు(తపోవనం క్రికెట్ అకాడమీ), బెస్ట్‌బౌలర్ సంజయ్ 23వికెట్లు (నార్పల), మోస్ట్ వ్యాల్యుబుల్ ప్లేయర్ తన్మయి కార్తికరెడ్డి 623పరుగులు, 8వికెట్లు, ఎమర్జింగ్ ప్లేయర్ రాజా నిలిచారు. డీఆర్‌ఓ మలోలా ముఖ్య అతిథులుగా హాజరై విజేత జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, ఇన్‌చార్జి సెక్రెటరీ భీమలింగారెడ్డి, ఆర్డీటీ గ్రాస్‌రూట్ కోఆర్డినేటర్ వంశీకృష్ణ, సీనియర్ అంపైర్ అన్సర్‌ఖాన్, కోచ్‌లు నరేష్, మహేశ్వర్, కుమార్, బొమ్మన్న తదితరులు పాల్గొన్నారు.



శాంతి కపోతాలను ఎగురవేస్తున్న ఎస్పీ, అధికారులు

# క్రీడలతో మానసికోల్లాసం

- జిల్లా ఎస్పీ జగదీష్‌బాబు
- పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ప్రారంభం


మాట్లాడుతున్న ఎస్పీ

అనంతపురం క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిత్యం ఒత్తిడితో కూడిన విధుల్లో ఉండే పోలీస్ సిబ్బందికి క్రీడా పోటీలతో దేహదారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే జిల్లా పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024 స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో సోమవారం ఎస్పీ ప్రారంభించారు. ఈ స్పోర్ట్స్ మీట్‌లో జిల్లాలోని ఏఆర్, స్పెషల్ పార్టీ విభాగాలతో పాటు ఏడు సబ్ డివిజన్లకు సంబంధించిన పోలీస్ క్రీడా బృందాలు పాల్గొన్నాయి. స్పోర్ట్స్ మీట్ అండ్ గేమ్స్ మీట్ ప్రారంభ సంకేతంగా కాగడా(జ్యోతి) వెలిగించారు. తెల్ల కపోతాలు, బెలూన్లను ఎగురవేశారు. క్రీడా పోటీల్లో పాల్గొంటున్న బృందాలను ఎస్పీ పరిచయం చేసుకుని వారి నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ క్రీడా పోటీల్లో హోదాలు మరిచి అందరూ ఒక టీంగా కష్టించాల్సి ఉంటుందన్నారు. చిన్న పెద్ద అనే భేదాలు లేకుండా సిబ్బంది మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. క్రీడల్లో బాగా రాణించి జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని ఎస్పీ ఆకాంక్షించారు. అనంతరం 800 మీటర్ల పరుగు, వాలీబాల్ క్రీడలను ఎస్పీ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్‌బాషా, డీఎస్పీలు వెంకటేష్, రవిబాబు, రామకృష్ణుడు, ఎస్బీ సీఐలు ధరణికిషోర్, క్రాంతికుమార్, ఆర్‌ఐలు రెడ్డప్పరెడ్డి, రాముడు, సీఐలు, జిల్లా పోలీస్ అధికారుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎదురీదుతున్న ఆంధ్రా

- పటిష్టస్థితిలో మహారాష్ట్ర


సెంచరీ కొట్టిన సుస్రుత్ సావంత్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కూచ్ బెహర్ అండర్-19 ట్రోఫీలో భాగంగా ఆంధ్రా-మహారాష్ట్ర జట్ల మధ్య జరుగుతున్న క్వార్టర్ ఫైనల్ పోటీలో ఆంధ్రా జట్టు ఎదురీదుతోంది. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో సోమవారం రెండో రోజు ఆట కొనసాగింది. ఓవర్‌నైట్ స్కోర్ 284/5తో రెండో రోజు మహారాష్ట్ర ఆట ఆరంభించింది. మరో 134పరుగులు జోడించి ఆలౌట్ అయ్యింది. దీంతో మహారాష్ట్ర స్కోరు 420పరుగులకు చేరింది. బ్యాటర్లు కిరణ్, సుస్రుత్ సావంత్ సెంచరీలతో రాణించారు. ఆంధ్రా బౌలర్లలో యువన్, ఆదిత్యరెడ్డి చెరో 3వికెట్లు, రాజేష్ 2వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఆంధ్రా మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 69 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. బ్యాటర్లు వరుణ్ సాత్విక్ 33పరుగులతో నాటౌట్‌గా నిలవగా, లోహిత్ లక్ష్మీనారాయణ 28పరుగులు చేశారు. కార్యక్రమంలో బీసీసీఐ సెలెక్టర్ హర్విందర్‌సింగ్ సోఢీ, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఏజీఎం శివకుమార్, మహారాష్ట్ర సెలెక్షన్ కమిటీ ఛైర్మన్ మిలింద్‌గుంజాల్, జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మీడియా మేనేజర్ రాజగోపాల్, ఏడీసీఏ కోశాధికారి షబ్బీర్, ఏసీఏ, ఏడీసీఏ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన తైక్వాండో పోటీలు

తాడిపత్రి, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని వైష్ణవి పాఠశాలలో ఓపెన్ జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు ముగిశాయని జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సాయిబాబా సోమవారం తెలిపారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు శివయ్య, వైష్ణవి పాఠశాల కరస్పాండెంట్ కరుణాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తైక్వాండో పిల్లల ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందన్నారు. ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా ద్వారా ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విజేతలకు జిల్లా అధ్యక్షుడు శివయ్య చేతులమీదుగా పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి సాయిబాబా మాట్లాడుతూ పోటీల్లో మొదటి బహుమతి అనంతపురం జట్టు గెలుచుకోగా, రెండవ బహుమతి తాడిపత్రి టీం, అనంతపురం రూరల్ టీం మూడో బహుమతి కైవసం చేసుకున్నాయని ఆయన తెలిపారు.


పోటీలను ప్రారంభిస్తున్న సీఐ

# ఫ్లై ఓవర్‌కు మోక్షం ఎప్పుడో..!

- ఐదేళ్లుగా ఆగిపోయిన పనులు
- ప్లాన్ మార్చాలని గ్రామస్థుల డిమాండ్


డి.హీరేహాళ్ వద్ద ఫ్లైఓవర్ నిర్మించ తలపెట్టిన ప్రదేశం

డి.హీరేహాళ్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ఐదేళ్లుగా ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి.. అన్న చందంగా సాగుతున్నాయి. బళ్లారి-బెంగుళూరు జాతీయ రహదారి 150ఏకు సంబంధించి ఐదేళ్ల క్రితమే పనులను ప్రారంభించారు. ఈ జాతీయ రహదారికి డి.హీరేహాళ్ మండల కేంద్రం మీదుగా ఆంధ్ర ప్రాంతంలో సుమారు 11 కి.మీ. పనులు చేపట్టారు. మండల కేంద్రంలో ఇరువైపులా వాహనాల రాకపోకల కోసం 1.7 కి.మీ. మేర ఫ్లైఓవర్ నిర్మాణానికి ఐదేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు అది పూర్తి కాలేదు. ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టినప్పటి నుంచి పనులు అర్ధంతరంగా ఆగిపోతున్నాయి. ఫ్లైఓవర్ నిర్మాణం మినహా రెండు సంవత్సరాలు క్రితమే జాతీయ రహదారి పనులు పూర్తి చేశారు. మొదటిసారి ఫ్లైఓవర్ నిర్మాణం పనులు చేపట్టినపుడు భూసేకరణలో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఇరువైపులా ఇళ్లు, హోటళ్లు, దుకాణాలు ఉన్నాయి. భూసేకరణలో చాలా మందికి పరిహారం అందలేదు. దీంతో ఫ్లైఓవర్ నిర్మాణం పనులు కొన్ని నెలలు ఆపివేశారు. తిరిగి కొంతమందికి పరిహారం చెల్లించి పనులు మొదలు పెట్టే సమయంలో మళ్లీ భూసేకరణ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. అప్పుడు కూడా కొన్ని నెలల పాటు పనులు నిలిపేశారు. ఆలస్యం కావడంతో నిర్మాణ సంస్థ ఈ పనుల నుంచి విరమించుకుంది. ఆరునెలల తర్వాత పనులను మరో నిర్మాణ సంస్థ చేపట్టింది. ఇళ్లు, దుకాణాలను చదును చేసి పనులను ప్రారంభించింది. మండల కేంద్రం మీదుగా కర్ణాటకకు రోజూ వందలాది పెద్ద వాహనాలు వెళుతుంటాయి. ఫ్లైఓవర్‌కు ఇరువైపులా వాహనాలు వెళ్లడానికి చిన్న అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టడంతో ఇబ్బందిగా ఉంటుందని గ్రామస్థులు పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఇక్కడ పెద్ద అండర్ పాస్ నిర్మించాలని విన్నవించినా పరిష్కరించకపోవడంతో గ్రామస్థులు మూకుమ్మడిగా పనులను అడ్డుకున్నారు. దీనిపై గ్రామస్థులు హైకోర్టును ఆశ్రయించడంతో ప్రస్తుతానికి నిర్మాణ పనులు నిలిపివేశారు. దుమ్ము, ధూళి అధికంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య ఎపుడు పరిష్కారమవుతుందో, ఫ్లైఓవర్ నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

### ప్లాన్ మార్చి నిర్మించాలి



ప్రతి రోజూ మండల కేంద్రం నుంచి వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. ఇక్కడి నుంచి ఎంతో ప్రసిద్ధిగాంచిన గవిసిద్దేశ్వర ఆలయం, కర్ణాటకలోని బసాపురం, మెట్రికి, నాగలాపురం తదితర గ్రామాలకు బస్సులు, లారీలు, పెద్ద పెద్ద వాహనాలు ప్రతిరోజూ వెళుతుంటాయి. వాహనాల రాకపోకల కోసం ఇక్కడ ఒక చిన్న అండర్ పాస్ నిర్మించ తలపెట్టారు. దీనివల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అండర్ పాస్ పెద్దదిగా నిర్మించాలి.

**-తిప్పేస్వామి, మాజీ సర్పంచ్, డి.హీరేహాళ్**

### పరిహారం అందలేదు..



జాతీయ రహదారి పనులు మొదలుపెట్టి ఏళ్ల గడుస్తున్నా చాలా మందికి భూసేకరణకు సంబంధించి పరిహారం అందలేదు. ముఖ్యంగా ఇక్కడ అధిక స్థలం కోల్పోయిన శివలింగతాత మఠం, రాఘవేంద్రస్వామి దేవాలయానికి సంబంధించి ఒక్క రూపాయి కూడా పరిహారం అందించలేదు. ఈ విషయమై పలుమార్లు అధికారులను అడిగినా పట్టించుకోలేదు. హోటళ్లు, దుకాణాలు కోల్పోయిన చాలామందికి పరిహారం అందలేదు.

**- వన్నూరుస్వామి, డి.హీరేహాళ్**

### ఉన్నతాధికారులకు నివేదించాం..



ఇక్కడ నిర్మించబోయే ఫ్లైఓవర్‌కు సంబంధించి చాలా ఏళ్లుగా నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోవడం వాస్తవమే. ముఖ్యంగా ఫ్లైఓవర్ నిర్మాణ లోపంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని, రూపకల్పన మార్పు చేసి నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. వారి డిమాండ్ మేరకు నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫ్లైఓవర్ నిర్మాణ పనులను పూర్తి చేస్తాం.

**- అనిల్‌కుమార్, తహసీల్దార్**

## న్యూస్‌బాక్స్

### టమోటా కిలో రూ. 17

అనంతపురం రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 17తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 900 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 12, కనిష్ఠ ధర రూ. 7 పలికినట్లు ఆయన తెలిపారు.

### చీనీ టన్ను రూ.33వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 33,190 పలికినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 12 వేలు, సరాసరి రూ. 25 వేలుతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 20 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

### హెచ్‌ఐవీ బాధితులకు ఉచిత కుట్టు శిక్షణ

అనంతపురం టౌన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ బాధిత మహిళల స్వయం ఉపాధి కోసం చేతివృత్తులపై శిక్షణ కల్పించడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా జిల్లా వైద్యశాఖ పరిధిలో గుర్తించిన బాధితులకు పంగల్ రోడ్డు సమీపంలో గల ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో కుట్టు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. విజయవాడకు చెందిన ఏఎన్‌పీ, సిద్ధి, ఉషా, వీఎం హెచ్ సంస్థలు హెచ్‌ఐవీ బాధితులకు కుట్టు శిక్షణకు సహకారం అందిస్తున్నారు. తొమ్మిది రోజులుపాటు ఈకుట్టు శిక్షణ ఇవ్వనున్నారు. ఈశిక్షణకు జిల్లాలోని 25మంది హెచ్‌ఐవీ బాధితులు హాజరయ్యారు. వారికి ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టరు గంగాధరరెడ్డి చేతులు మీదుగా కుట్టు మెషీన్లకు సంబంధించిన సామగ్రిని సోమవారం అందజేశారు. ఈసందర్భంగా గంగాధరరెడ్డి మాట్లాడుతూ హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపరాదన్నారు. వారి స్వయం ఉపాధి కోసమే కుట్టు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉషాకంపెనీ ప్రతినిధి రాజ్‌కుమార్, వాయువ్య మహిళామండలి ప్రతినిధి శివయ్య, అనంతనెట్‌వర్క్ ఆఫ్‌పాజిటివ్ సంస్థ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### షార్ట్ సర్క్యూట్‌తో వక్కతోట దగ్ధం

అమరాపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పార్లపల్లికి చెందిన మహిళారైతు జుంజమ్మ వక్కతోట విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సోమవారం దగ్ధమైంది. మహిళారైతు తనకున్న రెండెకరాల పొలంలో మూడేళ్ల క్రితం వక్కచెట్లను సాగు చేసింది. రూ.5లక్షల వరకు ఖర్చు చేసింది. అప్పులు చేసి 1400 వక్కచెట్లను పెంచింది. పొలంలో విద్యుత్ లైన్‌లో షార్ట్ సర్క్యూట్ అయి, మంటలు చెలరేగాయి. వక్క చెట్లకు వ్యాపించడంతో కాలిపోయాయి. వెయ్యి వక్కచెట్లు కాలిపోయినట్లు బాధితురాలు వాపోయింది. రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేసింది.

### వల చుట్టుకుని మత్స్యకారుడి మృతి

ఓబుళదేవరచెరువు, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): చేపల కోసం వల చుట్టుకుని మండలకేంద్రానికి చెందిన మత్స్యకారుడు నిరగొట్టు నగేష్(52) సోమవారం మృతిచెందాడు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. నగేష్ సోమవారం ఉదయం చేపలకోసం చెరువులో వల వేసి వచ్చాడు. సాయంత్రం వలలో చిక్కిన చేపలు పట్టుకోవడానికి చెరువులోకి వెళ్లాడు. పొరబాటున వల కాళ్లకు చుట్టుకోవడంతో నీటిలో మునిగి, మరణించాడు. ఎంతసేపటికీ అతడు రాకపోవడంతో కుమారుడు నవీన్ చెరువు వద్దకు వెళ్లి చూశాడు. తండ్రి ధరించిన చొక్కా నీటిపై తేలుతూ కనిపించింది. అక్కడికెళ్లి చూడగా తండ్రి మృతదేహం బయటపడింది. దీనిపై పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలాన్ని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి పరిశీలించారు. కేసు నమోదుచేసుకుని, శవాన్ని కదిరి ఆస్పత్రికి తరలించారు.

### పేకాట ఆడుతూ పట్టుబడిన ఉపాధ్యాయులు

కదిరి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇద్దరు టీచర్లు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. స్థానిక నిజాంవలి కాలనీలో సోమవారం రాత్రి పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.1.12 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన వారిలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నట్లు చెప్పారు. పట్టుబడిన వారిని మంగళవారం తహసీల్దార్ ముందు హాజరుపరుస్తామని సీఐ తెలిపారు.



సీతారాం ఏచూరికి నివాళులు అర్పిస్తున్న నాయకులు



సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు

# బీజేపీది విభజన వాదం

**సమైక్యతతో తిప్పికొట్టాలి**
**విధాన పరంగా మోదీ, బాబు, జగన్ ఒక్కటే**
**సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై. వెంకటేశ్వరరావు**
**అట్టహాసంగా సీపీఎం జిల్లా మహాసభలు ప్రారంభం**

అనంతపురం కల్చరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హిందుత్వం పేరుతో బీజేపీ దేశ ప్రజల మధ్య చీలిక తెచ్చే ప్రయత్నం చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై వెంకటేశ్వరరావు విమర్శించారు. తాము దేశ ప్రజల మధ్య ఐక్యతను కోరుకుంటుంటే బీజేపీ మతం పేరుతో విభజన కోరుకుంటోందన్నారు. బీజేపీ విభజన వాదాన్ని సమైక్యతతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సీపీఎం 14వ జిల్లా మహాసభలను పురస్కరించుకుని సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకు భారీ ప్రజా ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మహిళల కోలాటాలు, డప్పు కళాకారుల విన్యాసాలు, దరువు, ఉరుముల కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రముఖ కమ్యూనిస్టు నేతల చిత్రపటాలతో కూడిన 40 మీటర్ల ఎర్ర పతాకాన్ని రెడ్‌షర్ట్ వలంటీర్లు పట్టుకుని నడిచారు. అనంతరం లలితకళా పరిషత్‌లో సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో కళాకారులు తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. అనంతరం దివంగత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదనంతరం నిర్వహించిన బహిరంగ సభలో వెంకటేశ్వరరావు మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజా సంపదని కార్పొరేట్లకు దోచిపెట్టడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని ప్రైవేటుపరం చేసేందుకు మోదీ ప్రభుత్వం అన్నివిధాలా ప్రయత్నిస్తోందని విమర్శించారు. విద్యుత్ ఒప్పందాల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపణలొస్తున్నా రాష్ట్రంలోని అధికార టీడీపీ ఎందుకు నోరు మెదపడం లేదో ప్రజలకు చెప్పాలన్నారు. కార్పొరేట్లకు ఊడిగం చేసే విషయంలో మోదీ అయినా.. చంద్రబాబు అయినా.. జగన్మోహన్‌రెడ్డి అయినా ఒక్కటేనన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. సీపీఎం సీనియర్ నాయకుడు ఓబులు మాట్లాడుతూ అనంతపురం జిల్లాకు సాగు, తాగునీటిని అందించే హంద్రీనీవా, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువల ఆధునికీకరణను ఈ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ మాట్లాడుతూ సీపీఎం ఈ మూడు సంవత్సరాల కాలంలో చేపట్టిన కార్యక్రమాలను పునఃసమీక్షించుకుని, రానున్న మూడేళ్ల కార్యాచరణను ఈ 14వ మహాసభల్లో తీర్మానిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సావిత్రి, బాలరంగయ్య, నల్లప్ప, నాగేంద్రకుమార్, జిల్లా కమిటీ సభ్యులు నాగమణి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు, వెంకటనారాయణ, కృష్ణమూర్తి, సూర్యచంద్ర యాదవ్, మన్నీల రామాంజనేయులు, ఆర్‌వీ నాయుడు పాల్గొన్నారు.

**ప్రతినిధుల సభ ప్రారంభం...**

సీపీఎం జిల్లా 14వ మహాసభలను పురస్కరించుకుని సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి జిల్లా కేంద్రంలోని గుత్తిరోడ్డు ఎస్ఎస్ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. ఈ సందర్భంగా కామ్రేడ్ ముష్కిన్ ప్రాంగణంలో మహాసభల ఆరంభసూచికగా ఎర్రజెండాను సీపీఎం జిల్లా సీనియర్ నాయకుడు నాగరాజు ఎగురవేశారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఇటీవలి కాలంలో చనిపోయిన వామపక్ష నాయకులకు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం మహాసభలనుద్దేశించి వై వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డిలు మాట్లాడారు. తదనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ నివేదికను ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, బాలరంగయ్య, సావిత్రి, శ్రీనివాసులు, నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

# మీరైనా పట్టించుకోండి

## హాస్టళ్లలో క్లిష్టంగా మెనూ అమలు

**పెరిగిన ధరలతో వార్డెన్ల ఇబ్బందులు**
**కూటమి ప్రభుత్వంపైనే ఆశలు**
**సమస్యలు పరిష్కరించాలని వినతి**

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ చర్యలతో సంక్షేమ వసతి గృహాల్లో మెనూ అమలు క్లిష్టంగా మారింది. అప్పటి ప్రభుత్వం మెనూను భారీగా పెంచింది. కానీ అందుకు అనుగుణంగా చార్జీలు పెంచలేదు. మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు పరిశీలించకుండా ఒక్కో విద్యార్థిపై రూ.150 నుంచి రూ.200 పెంచి డైట్ చార్జీలు పెంచినట్లు గొప్పగా ప్రకటించుకుంది. ఈ ధరలతో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ అమలు చేయలేక వార్డెన్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వమైనా చొరవ చూపి మెనూ సమస్యలు పరిష్కరించాలని పలువురు వార్డెన్లు కోరుతున్నారు.



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం (ఫైల్)

**గత టీడీపీ పాలనలో...**

2012వ సంవత్సరంలో ప్రీమెట్రిక్ హాస్టల్‌కు రూ.750, పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌కు రూ.1050గా డైట్ చార్జీలు నిర్ణయించారు. అయితే గత టీడీపీ ప్రభుత్వం ఆ ధరలను భారీగా పెంచింది. జిల్లాస్థాయిలో కలెక్టర్ సమక్షంలో ఓ కమిటీని ఏర్పాటు చేసి మార్కెట్ ధరలకు అనుగుణంగా డైట్ చార్జీలు నిర్ణయించేలా ఆదేశాలు జారీ చేసింది. ప్రీమెట్రిక్ హాస్టల్ విద్యార్థులకు రూ.750లు ఉన్న డైట్ బిల్లులను రూ. 1250లకు పెంచింది. పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ డైట్ చార్జీలను 1050 నుంచి రూ. 1400కు పెంచింది. దీంతో వార్డెన్లు మెనూను సక్రమంగా అమలు చేసేవారు.

**వైసీపీ ప్రభుత్వ తీరుతో ఇబ్బందులు**

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దాదాపు మూడున్నరేళ్ల వరకూ డైట్ చార్జీల పెంపు విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. తర్వాత 3,4 తరగతుల విద్యార్థులకు రూ. 1150, ఐదు నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ. 1400, ఇంటర్మీడియట్ ఆపై తరగతుల విద్యార్థులకు రూ.1600లు చెల్లించేందుకు నిర్ణయించింది. అయితే గత ఐదేళ్లుగా కందిబేడలు, పామాయిల్, చికెన్ తరహా వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. అప్పటి ప్రభుత్వం పెంచిన అరకొర చార్జీలతో నిర్దేశించిన మెనూను అమలు చేసేందుకు వార్డెన్లు నానా తిప్పలు పడ్డారు.

**కాస్మెటిక్స్‌కు కటకటే...**

కాస్మెటిక్స్ చార్జీల పెంపును సైతం గత ప్రభుత్వం అరకొరగానే అమలు చేసింది. గతంలో 3 నుంచి 6వ తరగతులకు రూ. 50-60 ఉన్న కాస్మెటిక్స్ చార్జీలను తెలుగుదేశం ప్రభుత్వం 2014లో రూ. 100-110లకు పెంచింది. వాటిని వైసీపీ ప్రభుత్వం రూ. 125-130కి పెంచింది. 7 నుంచి 10 తరగతుల విద్యార్థులకు రూ. 70-80లు ఉన్న కాస్మెటిక్స్ చార్జీలను 2014లో టీడీపీ ప్రభుత్వం రూ. 125-160 వరకూ పెంచింది. వైసీపీ ప్రభుత్వం రూ.150-200లకు పెంచింది. హెయిర్ కటింగ్ రూ. 30లు ఉండగా... రూ. 50లకు పెంచింది. ఈ అరకొర పెంపుతో అవసరాలు తీరక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



**మంత్రి సవిత చొరవ తీసుకోవాలి**

వైసీపీ ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాల్లో డైట్ చార్జీలు పెంచకుండా పేద విద్యార్థుల పొట్ట కొట్టింది. రాష్ట్రాన్ని విద్యాహబ్ చేస్తామని విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేశారు. పాదయాత్ర సమయంలో సంక్షేమ హాస్టళ్లను ఉన్నతస్థాయిలో ఉంచుతామని నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఇప్పటికే విద్యాపరమైన అంశాల్లో అనేక మార్పులు తెస్తున్నారు. మంత్రి సవిత చొరవ తీసుకొని డైట్ చార్జీల పెంపు విషయంపై రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడాలి. డైట్ చార్జీలు పెరిగితే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతుంది.

- బీసీ సురేష్‌యాదవ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య



**రూ. మూడు వేలకు పెంచాలి**

సంక్షేమ వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులకు ఒక్కొక్కరికి డైట్ చార్జీలు రూ. 3వేలకు పెంచాలి. గత ప్రభుత్వంలో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాలను గాడిలో పెట్టాల్సిన అవసరం ఉంది. జిల్లాలో శిథిలావస్థకు చేరిన హాస్టళ్లకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి పునర్నిర్మాణం చేయాలి. ప్రస్తుతమున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేయాలి. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రతి హాస్టల్‌లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలి.

- ఓతూరు పరమేష్, జిల్లా ప్రధానకార్యదర్శి, ఎస్ఎఫ్ఐ

# చంద్రబాబుతోనే గ్రామాలకు స్వర్ణయుగం

**పంచాయతీరాజ్ చాంబర్ జాతీయ అధ్యక్షుడు బాబు రాజేంద్రప్రసాద్**
**ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌కు సన్మానం**



ఎమ్మెల్యే దగ్గుపాటిని సన్మానిస్తున్న బాబు రాజేంద్రప్రసాద్ ఇతర నాయకులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాలకు స్వర్ణయుగం సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని పంచాయతీరాజ్ చాంబర్ జాతీయ అధ్యక్షుడు బాబు రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక జడ్పీ ఆవరణంలోని సమావేశపు హాల్‌లో సోమవారం అనంత ఉమ్మడి జిల్లా ఏపీ పంచాయతీరాజ్ చాంబర్, సర్పంచుల సంఘాల ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా పంచాయతీరాజ్ చాంబర్ సభ్యుడిగా పనిచేసి ఎమ్మెల్యేగా ఎదిగిన అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌ను పంచాయతీ రాజ్ చాంబర్, సర్పంచుల సంఘం ఆధ్వర్యం లో సన్మానించారు. పంచాయతీరాజ్ చాంబర్ జాతీయ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వానపల్లి లక్ష్మీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి, రాష్ట్ర కార్యదర్శి ఇస్మాయిల్ ఆజాద్, ఉమ్మడి అనంత జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు గొనుగుంట్ల భూషణ్ తదితరులు ఎమ్మెల్యే దగ్గుపాటిని సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన బాబు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. సర్పంచుల నిధులను దుర్వినియోగం చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. తాజాగా గత ప్రభుత్వంలో పెండింగ్‌లోని రూ.వెయ్యి కోట్లతోపాటు మరో రూ.2500 కోట్లు మంజూరు చేశారన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా రూ.4500 కోట్ల నిధులు మంజూరు చేయడం శుభపరిణామమన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులపై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి ఉన్న నాలుగేళ్ల కాలపరిమితిని రెండేళ్లకు కుదించాలని మంత్రి వర్గంలో ప్రతిపాదన పెట్టగా సీఎం చంద్రబాబు నిరాకరించారన్నారు. ఈ ఘటనే సీఎం చంద్రబాబు విలువలతో కూడిన రాజకీయం చేస్తారనేందుకు నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మాట్లాడుతూ పంచాయతీ చాంబర్‌లో పనిచేయడం ద్వారానే తాను ఎమ్మెల్యే స్థాయికి వచ్చానన్నారు. అప్పట్లో తనకు సహకరించిన ఎమ్మెల్యే పరిటాల సునీత, రాజేంద్రప్రసాద్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సర్పంచుల సమస్యలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారాలోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ చాంబర్ నాయకులు మునిరెడ్డి, ధనుంజయయాదవ్, ముత్యాలరావు, వెంగమనాయుడు, ప్రతాప్‌నాయుడు, వేలూరు రంగయ్య, వీరేష్, సుబ్బరామయ్య, ఆలం వెంకట నరసానాయుడు పాల్గొన్నారు.

# నలుగురు గంజాయి విక్రేతల అరెస్ట్

**ఓ కారు, మూడు కిలోల గంజాయి స్వాధీనం**



అరెస్ట్ వివరాలను వెల్లడిస్తున్న సీఐ మనోహర్

గుంతకల్లుటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం నలుగురు గంజాయి విక్రేతలను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి ఓ కారు, మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మనోహర్ అరెస్ట్ వివరాలను వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన రాము, రామకృష్ణ, వెంకటసాయి, గుంతకల్లుకు చెందిన షికారి దుర్గేష్‌లు ఒడిశా రాష్ట్రంలో గంజాయిని కొనుగోలు చేసేవారు. బళ్లారికి చెందిన వెంకటసాయి ద్వారా ఒడిశాలో కొనగోలు చేసిన గంజాయిని రైల్లో గుంతకల్లుకు తెస్తారు. దాన్ని చిన్న, చిన్న ప్యాకెట్ల ద్వారా ఈ నలుగురు కలిసి విక్రయించేవారన్నారు. ఉదయం రైల్వేస్టేషన్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఫీడ్ కేఏ30ఎన్ కారును అనుమానంతో తనిఖీ చేశామన్నారు. అందులో ఓ బ్యాగ్‌లో రెండు కిలోలు, మరో బ్యాగ్‌లో ఒక కిలో గంజాయిని గుర్తించి, స్వాధీనం చేసుకున్నామన్నారు. ఒడిశాలో కిలో రూ. 5వేలకు కొని, ఇక్కడ 5గ్రాములు రూ. 200ప్రకారం విక్రయిస్తారన్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ జయప్రకాశ్ రెడ్డి, వన్‌టౌన్ ఏఎస్ఐ వెంకటనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

**ఎస్సీ హాస్టళ్ల మరమ్మతులకు రూ.11.56 కోట్లు విడుదల**



మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామిని సత్కరిస్తున్న బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత

అనంతపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గు రైన ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాలు మెరుగుపరచడానికి రాష్ట్ర ప్రభు త్వం ఉమ్మడి జిల్లాకు రూ. 11.56 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామికి బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం సచివాలయంలో మంత్రి డోలాను కలిసి సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభివృద్ధి జరుగుతుందన్నారు. వైసీపీ పాలనలో నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అంటూ బడుగు, బలహీన వర్గాలను జగన్ ఓటు బ్యాంకుగా చూశారేగానీ అభివృద్ధికి ఏనాడూ పాటుపడలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ బిడ్డలు చదువుకోవడం జగన్‌కు ఇష్టం లేదన్నారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లను పట్టించుకోలేద న్నారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన డైట్, కాస్మెటిక్ బిల్లులను చెల్లించలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల విద్య, అభివృద్ధికి చంద్రబాబు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. బీసీ సంక్షేమ హాస్టళ్ల మరమ్మతులతోపాటు విద్యార్థుల డైట్ బిల్లులను తమ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

# తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- ఇద్దరి అరెస్టు
- 20 తులాల బంగారం స్వాధీనం



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

హిందూపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పగటిపూట తాళం వేసిన ఇళ్లను రెక్కీ నిర్వహించి, రాత్రయితే చోరీలకు పాల్పడుతున్న దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 20 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ రత్న తెలిపారు. స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నిందితుల అరెస్టు వివరాలను ఎస్పీ వెల్లడించారు. పట్టణంలోని రహమత్‌పురానికి చెందిన అల్లాబకష్, సయ్యద్ నూరుల్లా, విద్యానగర్‌కు చెందిన భువనేశ్వరి వ్యసనాలకు బానిసయ్యారు. వీరు త్యాగరాజ్‌నగర్‌కు చెందిన ఎరుకల కావడి నాగేంద్ర, సాకే ప్రవీణ్‌కుమార్, గుడ్డు ప్రాంతంలో నివాసమున్న చాకలి శ్రీనివాస్‌తో కలిసి కొంతకాలం క్రితం పట్టణంలో పలుచోట్ల రాత్రిపూట చోరీలు చేశారు. దీనిపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. డీఎస్పీ మహేష్ ఆధ్వర్యంలో అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు, టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం, వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు, సిబ్బంది.. దొంగలపై నిఘా వేశారు. ఈ తరుణంలో సోమవారం హిందూపురం మండలంలోని ఆటోనగర్ క్రాస్‌వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా రహమత్‌పురానికి చెందిన నిందితులు అల్లాబకష్, సయ్యద్ నూరుల్లా పట్టుబడ్డారు. వారిని విచారించి, వారి నుంచి 197 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.15 లక్షలకుపైగా ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఎరుకల కావడి నాగేంద్ర, సాకే ప్రవీణ్‌కుమార్, చాకలి శ్రీనివాస్ సామూహిక అత్యాచారం కేసులో జైలులో ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం చోరీ కేసుల్లో భువనేశ్వరిని అరెస్టు చేయాల్సి ఉందని ఎస్పీ తెలిపారు. వీరంతా బృందంగా ఏర్పడి, తాళాలు వేసిన ఇళ్లను గుర్తించి బీరువాల్లోని బంగారు నగలు కొట్టేయడమే పనిగా పెట్టుకున్నారు. వచ్చిన డబ్బుతో జల్సా చేసేవారు.

### మద్యం మత్తులో స్నేహితుడి హత్య

తాడిపత్రి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావివెంకటాంపల్లి గ్రామసమీపంలో వంశీ (26) అనే యువకుడిని అతడి మిత్రులే రాళ్లతో కొట్టి దారుణంగా హత్య చేశారని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన మేరకు రావివెంకటాంపల్లికి చెందిన వంశీ ఐషర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. సోమవారం మధ్యాహ్నం మిత్రులతో కలిసి మద్యం సేవించడానికి గ్రామ సమీపంలోని ముళ్లపొదల్లోకి వెళ్లారు. కొంత సమయం తర్వాత వీరి మధ్య మద్యం విషయంలో గొడవపడ్డారు. దీంతో కోపోద్రిక్తులైన మిత్రులు వంశీని రాళ్లతో కొట్టి చంపారని తెలిపారు. అనంతరం వీరు పరారయ్యారని సీఐ తెలిపారు. గతంలో వంశీ ఇదే గ్రామానికి చెందిన పలువురు యువకులతో ఐషర్ బాడుగ విషయంలో గొడవపడ్డాడని తెలిపారు. ఈ కోణంలో కూడా విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య అంజలి ఉన్నారు. మృతుడి తల్లి నాగరత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

### యువకుడి మృతి



ఆంజనేయులు మృతదేహం

తాడిపత్రి, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): పామిడి మండలంలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు (31) రైలులో ప్రయాణిస్తూ సోమవారం మృతి చెందాడని రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. ఆయన తెలిపిన మేరకు అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన రవిచంద్ర, రమణమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడు సంజీవరాయుడు తిరుపతిలో బార్బర్ పని చేస్తుండగా, రెండో కుమారుడైన ఆంజనేయులు అన్నమయ్య జిల్లాలోని రైల్వేకోడూరులో బార్బర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఇంటికి వస్తున్నానని తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పాడు. ఈక్రమంలోనే తిరుపతి నుంచి హుబ్బళ్లికి వెళ్లే రైలు ఎక్కాడు. ఆర్ఎస్ కొండాపురం రైల్వేస్టేషన్ దాటిన తర్వాత కూర్చొన్న సీటులోనే స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన ప్రయాణికులు తాడిపత్రి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. తాడిపత్రి రైల్వేస్టేషన్ రాగానే అంబులెన్స్‌లో ఆంజనేయులును ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇంకా పెళ్లి కాలేదని తెలిపారు.

## సంక్షిప్తం

### బీఆర్ఎస్ నాయకుడి అరెస్ట్

● సోషల్ మీడియాలో పోస్టుల ఫలితం


విజయ్‌కుమార్

అనంతపురం క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో టీడీపీ నాయకులపై అసభ్యకర పోస్టులు పెట్టిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు విజయ్ కుమార్‌ను అనంతపురం రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి, సోమవారం రిమాండ్‌కు పంపారు. విజయకుమార్ తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా కంది మండలం ఎద్దుమైలారం చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ స్థాయి నాయకుడు. సీఐ శేఖర్ తెలిపిన మేరకు విజయ్‌కుమార్ మంత్రి నారా లోకేశ్‌కు సంబంధించి సోషల్ మీడియా వేదికైన ఎక్స్(ట్విట్టర్)లో ఈ ఏడాది ఆగస్టులో అసభ్యకర పోస్టులు పెట్టాడు. ఈ విషయంపై స్థానిక టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు రఫీ ఫిర్యాదు మేరకు అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శేఖర్ సిబ్బందితో వెళ్లి అతన్ని హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు పంపారని తెలిపారు.

### ఆరు ఇసుక వాహనాలు సీజ్

గార్లదిన్నె, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా మండలంలో అక్రమంగా ఇసుకు తరలిస్తున్న ఆరు వాహనాలను ఎస్ఐ మహ్మద్ గౌస్ బాషా సీజ్ చేశారు. పెన్నానది పరివాహకంలోని కల్లుమడి ప్రాంతం నుంచి సోమవారం తెల్లవారుజామున ఆయన పట్టుకున్నారు. ఐదు ట్రాక్టర్లు, ఒక టిప్పర్‌ను సీజ్ చేసి గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

### సభ్యత్వ నమోదుకు విరాళం

అనంతపురం అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేదలతో పార్టీ సభ్యత్వ నమోదు కోసం పలువురు టీడీపీ నాయకులు రూ.2.25 లక్షలు విరాళం అందజేశారు. టీడీపీ అర్బన్ కార్యాలయంలో సోమవారం మూడో డివిజన్ టీడీపీ నాయకుడు బోయ నాగరాజు రూ.75వేలు, 44వ డివిజన్‌కు చెందిన రాజేష్, 6వ డివిజన్‌కు చెందిన వెంకటస్వామి, 50వ డివిజన్‌కు చెందిన నరేంద్ర చౌదరి రూ.50వేలు చొప్పున ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు అందించారు. వారిని ఎమ్మెల్యే అభినందించారు.

### శభాష్ నాగరాజు..


నాగరాజును సన్మానిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శభాష్ నాగరాజు... పార్టీ సభ్యత్వాలు బాగా చేశావని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ టీడీపీమూడో డివిజన్ ఇన్‌చార్జి బోయ నాగరాజును అభినందించారు. స్థానిక మూడో డివిజన్ పరిధిలో నాగరాజు తన లాగిన్ ద్వారా 1360 పార్టీ సభ్యత్వాలు చేయించి, అర్బన్‌లో మొదటి స్థానంలో నిలిచారు. ఈ నేపథ్యంలో సోమవారం టీడీపీ అర్బన్ కార్యాలయంలో నాగరాజుకు ఎమ్మెల్యే శాలువ కప్పి సన్మానించారు.

### టూటౌన్ పీఎస్‌కు పరిటాల హత్యకేసు ముద్దాయిలు

అనంతపురం క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత పరిటాల రవి హత్య కేసులో జైలు శిక్ష అనుభవిస్తూ బెయిల్‌పై విడుదలైన ఐదుగురు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సంతకాలు చేశారు. ఈ హత్య కేసులో ముద్దాయిలైన నారాయణరెడ్డి, ఓబిరెడ్డి, రంగనాయకులు, వడ్డె కొండ తాజాగా కడప సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. అదేరోజు విశాఖపట్నం సెంట్రల్ జైలు నుంచి రేఖమయ్య విడుదలయ్యాడు. ఈ ఐదుగురు కండీషన్ బెయిల్ కింద ప్రతి సోమవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. అందులో భాగంగా సోమవారం సీఐ శ్రీకాంత్ సమక్షంలో సంతకాలు చేసి వెళ్లిపోయారు.

### 1303 టన్నుల యూరియా సరఫరా

అనంతపురం అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు సోమవారం 1303 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో 800 మెట్రిక్ టన్నులు ఏపీ మార్క్‌ఫెడ్‌కు, 503 మెట్రిక్ టన్నులు ప్రైవేటు డీలర్లకు కేటాయించారన్నారు.

### మట్కా బీటర్ల అరెస్ట్

అనంతపురం క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పాతూరులో మట్కా నిర్వహిస్తున్న ముగ్గురిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. తాడిపత్రి బస్టాండ్ సమీపంలోని కూరగాయల మార్కెట్ వద్ద నలుగురు మట్కా నిర్వహిస్తుండగా వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి రూ. 14,200 నగదు స్వాధీనం చేసుకున్నారు.

### ఎలుగుబంట్ల హల్‌చల్


పొలాల్లో సంచరిస్తున్న ఎలుగుబంటి

కనగానపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దలచెరువు గ్రామంలో రెండు ఎలుగుబంట్లు హల్‌చల్ చేస్తున్నాయని గ్రామ రైతులు తెలిపారు. వారం రోజులుగా రెండు ఎలుగుబంట్లు గ్రామ సమీపంలో ఉన్న రైతులు ఎగువ నాగరాజు, పూజారి చెరువన్న, రామచంద్ర పొలాల్లో కంది, ఆముదం పంటలో సంచరిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల అల్లే చంద్రప్పపై దాడి చేసిందన్నారు. దీంతో పొలాల వద్దకు వెళ్లేందుకు భయపడుతున్నట్లు తెలిపారు.

# మురుగునీటితో సహజీవనం

● దుర్వాసనతో స్థానికుల అవస్థలు
● ఆర్నెల్లుగా ఇదే పరిస్థితి


అపార్ట్‌మెంట్ వద్ద కుంగిన ర్యాంప్

అనంతపురం రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓ అపార్ట్‌మెంట్ వారి నిర్వాకం వల్ల దాని చుట్టు పక్కల నివశించే వారు ఆర్నెల్లుగా మురుగునీటితో సహజీవనం చేస్తున్నారు. మండలంలోని పాపంపేట పంచాయతీ గణేష్‌నగర్‌లో ఈ పరిస్థితి కనిపిస్తుంది. అక్కడ ఓ అపార్ట్‌మెంట్ నిర్వాహకులు డ్రైనేజీ కాలువపై ర్యాంప్ ఏర్పాటు చేశారు. అయితే ఆ ర్యాంప్ దెబ్బతిని కాలువలోకి కుదువబడిపోయింది. ఫలితంగా మురుగు నీరు ముందుకు సాగేందుకు వీలు లేకుండా పోయింది. దీంతో కాలువలోని మురుగు నీరంతా అపార్ట్‌మెంట్ పక్కనున్న ఖాళీ స్థలం చేరింది. నెలల తరబడి మురుగునీరు నిల్వ ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్నెల్లుగా ఇదే పరిస్థితి వారిది. సమస్యను స్థానికులు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, అధికారులు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. ఈ క్రమంలో అపార్ట్‌మెంట్ నిర్వాహకులు కాలువలో పడిపోయిన బండలను, ఇతరత్రా వాటిని తొలగించి ర్యాంపు నిర్మిస్తామని చెప్పినట్లు తెలుస్తోంది. అయితే అపార్ట్‌మెంట్ నిర్వాహకులు పనులు చేయించడంలో జాప్యం చేస్తుండటంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించి మురుగునీటి ఇబ్బందులను తొలగించాలని ఆ అపార్ట్ మెంట్ చుట్టుపక్కల నివశించే వారు కోరుతున్నారు.


అపార్ట్‌మెంట్ పక్కనున్న ఖాళీ స్థలంలో నిలిచిన మురుగునీరు

# క్రీస్తు బోధనలు స్ఫూర్తిదాయకం

ప్రీ క్రిస్మస్ వేడుకల్లో ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి


క్రిస్మస్ కేక్‌ను కట్‌చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


కొవ్వొత్తులతో క్రైస్తవుల ప్రార్థనలు

అనంతపురం కల్చరల్, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి స్ఫూర్తిదాయకమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. అరవిందనగర్‌లోని సీయస్ఐ హోలి ట్రినిటి చర్చిలో సోమవారం రాత్రి జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వ ర్యంలో ప్రీక్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ అధ్యక్షతన నిర్వ హించిన కార్యక్రమానికి ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ముఖ్యఅతిథులుగా హాజర య్యారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి, క్రిస్మస్ శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చంద్రబాబు ఆదేశాల మేరకే క్రిస్మస్‌ను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే దగ్గుపాటి మా ట్లాడుతూ... గతంలో పాస్టర్లకు రూ.5వేలు గౌరవ వేతనం ఇచ్చేవారని, దానిని ముఖ్యమంత్రి చంద్రబా బు రూ.8వేలకు పెంచారని గుర్తు చేశారు. అనంతరం పలు కోయర్ బృందాలు క్రీస్తు భక్తిగీతాలు ఆల పించ గా చర్చి ప్రెస్బిటర్ ఇన్చార్జ్ రెవరెండ్ బెన్‌హర్‌బాబు ఆధ్యాత్మిక సందేశమిచ్చారు. అనంతరం పలువురు పాస్టర్లను మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో నగరపాలక డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శమంతక మణి, టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామి దాస్, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖాధికారి రామసుబ్బా రెడ్డి, క్రిస్టియన్ మైనార్టీ డీపీఎం మధుసూదన్‌రెడ్డి, ఆర్డీ ఓ కేశవనాయుడు, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికు మార్, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, తహసీల్దార్ హరికు మార్, పాస్టర్లు భాస్కర్, జాన్ సుధీర్, కృపాదాసు, జాన్ సుధాకర్, విజయరాజు పాల్గొన్నారు.

# విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

● క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే పరిటాల సునీత


విద్యార్థినికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే

రామగిరి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండి, మంచి నడవడికతో ముందుకెళ్లాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికా విద్యాలయం, జూనియర్ కళాశాల విద్యార్థినులతో కలిసి ఎమ్మెల్యే సోమవారం క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నా రు. కేక్‌కట్ చేసి విద్యార్థులకు తినిపించారు. అనంత రం పాఠశాలను పరిశీలించారు. ఇంటర్ వరకు తరగ తులు ఉండటంతో విద్యార్థులతో మాట్లాడారు. వాటర్ ప్లాంటు పాడైందని మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేయగా ఒక్క రోజులోనే చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే మండల రెవిన్యూ అధికారితో మాట్లాడి అనువైన ఆటస్థలం ఏర్పాటు చేస్తానన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ...విద్యార్థినులతో కలిసి క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. ఇటీవల కొందరు సెల్‌ఫోన్‌లు చూసి చెడుదోవ పడుతున్నారని ఇది ఎంత మాత్రం సరికాదన్నారు. ప్రతి ఒక్కరు లక్ష్యాన్ని పెట్టుకుని అందుకు ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రామ్మూర్తినాయుడు, ఎంఈఓ శ్రీనివాసులు, కేజీబీవీ ఎస్ఓ సౌమ్యలత, టీడీపీ నాయకులు పేపర్‌శీన, అక్కులప్ప, ఎల్ శ్రీధర్ నాయుడు, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ శ్రీనివాసులు, గుర్రంశీన, నాగరాజు, చంద్రమోహన్, మనోహర్, విశ్వనాథ్ నరసయ్య పాల్గొన్నారు.

### పంట కోత యంత్రం పంపిణీ

అనంతపురం అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి యాంత్రీకరణ తోడైతే అద్భుతాలు సృష్టించవచ్చునని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. నగరంలోని ఆమె నివాసం వద్ద సోమవారం కనగానపల్లి మండలం వేపకుంటకు చెందిన రైతు శివశంకర్‌కు సబ్సిడీతో పంట కోత యంత్రాన్ని ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంట కోత యంత్రం కోసం దరఖాస్తు చేయడంతో మంజూరు చేసిందన్నారు. యంత్రం విలువ రూ.5.70 లక్షలు కాగా.. ఇందులో రూ. 2 లక్షలు సబ్సిడీ వర్తిస్తుందన్నారు. మిగతా రూ.3.70 లక్షలు రైతు చెల్లించారన్నారు. ఎమ్మెల్యేకు రైతు కృతజ్ఞతలు తెలియజేశారు.

### మండ్లి కిషోర్‌కు అబ్దుల్ కలాం పురస్కారం


పురస్కారం అందుకుంటున్న కిషోర్‌కుమార్

అనంతపురం కల్చరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని సీవీఆర్ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న డాక్టర్ మండ్లి కిషోర్ కుమార్ అబ్దుల్ కలాం జాతీయ పురస్కారం అందుకున్నారు. డాక్టర్ చివుకుల హనుమంత రావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వివిధ రంగాలకు చెందిన పలువురిని అబ్దుల్ కలాం జా తీయ పురస్కారాలకు ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో విద్యారంగానికి సంబంధించి డాక్టర్ మండల్లి కిషోర్ కుమార్ ఎంపికయ్యారు. ఆయనకు సోమవారం గుంటూరులోని ఆ ట్రస్టు కార్యాలయంలో నిర్వహించిన సభలో ఇస్రో శాస్త్రవేత్త కె. రామ్మోహనరావు, గుంటూరు జిల్లా సైన్స్ ఆఫీసర్ రాజశేఖర్ చేతులమీదుగా పురస్కార ప్రదానం చేసి, సత్కరించారు.

### కేంద్రమంత్రిపై కేసు నమోదు చేయాలి

● ఎస్పీకి ప్రజాసంఘాల నాయకుల ఫిర్యాదు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై కేసు నమోదు చేయాలని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజా సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్‌చేశారు. ఈ మేర కు సోమవారం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి అధ్వర్యంలో ఎస్పీ జగదీష్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం సాకేహరి మాట్లాడుతూ... అంబేద్కర్‌ను అవమాన కరంగా హేళనచేసిన అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాణలు చెప్పించేంత వరకు ఉద్యమాలు సాగుతూనే ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మాల మహానాడు ఓబులేసు, కాంగ్రెస్ పార్టీ ఇమామ్, రైట్స్ ఫోరం పెద్దన్న, రాజు, ఐఎంఎం బాష, సమతా సైనిక్‌దళ్ శ్రీనివాసులు, ఎరుకల సంఘం మహేశ్వరి, పీహెచ్‌పీఎస్ మాధవ్, ఓబులు, రాజు, రామకృష్ణ, కేశవ్ పాల్గొన్నారు.

# చచ్చిపోవాలనిపిస్తోంది సార్..!

● కాపాడాలని ఆర్డీఓకు వృద్ధ దంపతుల వినతి


ఆర్డీఓను కలిసి వచ్చిన వృద్ధ దంపతులు

అనంతపురం క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'కొడుకు చేసిన అప్పులు తీర్చమని మమ్మల్ని వేధిస్తున్నారు. రక్షణగా ఉండాల్సిన కొడుకేమో తాగొచ్చి కొడుతున్నాడు. సమస్య పరిష్కరించాల్సిన పోలీసులూ మమ్మల్నే దూర్భాషలాడుతున్నారు. వృద్ధాప్యంలో ప్రశాంత జీవనం గడిపేలా న్యాయం చేయండి' అని ఓ వృద్ధ జంట అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడుకు విన్నవించారు. అనంతపురం నగరంలోని కమలానగర్‌కు చెందిన తిరువీధుల బద్రీనారాయణ, శశికళ దంపతులు సోమవారం ఆర్డీఓను కలిసి వినతిపత్రం అందజేశారు. తమకు కొడుకు లోకేష్‌కుమార్, కుమార్తె చందనప్రియ సంతానమన్నారు. కొడుకు వ్యసనాలకు బానిసై తెలిసిన వారితో, బంధువులతో రూ.లక్షల్లో అప్పులు చేశాడని, అప్పు ఇచ్చిన వారికి తమ మీద చెబుతూ తిరుపతి, బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో జల్సాగా కాలం గడుపుతున్నాడన్నారు. తల్లిదండ్రులుగా బీఫార్మసీ వరకు చదివించి కర్నూలు జిల్లా కు చెందిన యువతితో పెళ్లి జరిపించామన్నారు. మూడు నెలలకే భార్యతో ఇమడలేక దూరమయ్యాడన్నారు. ఈ క్రమంలో ఆ అమ్మాయికి జీవనాధారం కింద రూ.14.50 లక్షలు డీడీ రూపంలో 11తులాల బంగారం ఇచ్చామన్నారు. ఈ విషయం కోర్టులో ఉందని విడాకులూ రాలేదన్నారు. అప్పులు ఇచ్చిన వాళ్ళంతా మీ అబ్బాయి అందుబాటులో లేడని, మీరు డబ్బు కట్టాలని ఇంటి వద్దకు వచ్చి గొడవ చేస్తున్నారన్నారు. రక్షణగా ఉండాల్సిన కొడుకు తాగి వచ్చి దాడికి పాల్పడుతున్నాడన్నారు. కోడలి తండ్రి కర్నూలు జిల్లా పోలీసులతో ఫోన్లు చేయించి, డబ్బు కట్టాలని వేధిస్తున్నాడన్నారు. ఈ విషయంలో పోలీసులు మమ్మల్ని దుర్భాషలాడుతున్నారన్నారు. అప్పు విషయంగా తాడిపత్రి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తనపై ఫిర్యాదు ఉందని బద్రీనారాయణ తెలిపాడు. మేము ఎవరికీ ష్యూరిటీ ఇవ్వలేదన్నారు. అయినా అప్పులు ఇచ్చినవారు మానసికంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముసలి వయసులో తమకు రక్షణ కరువైందని, చనిపోవాలనిపిస్తోందని కన్నీటి పర్యంతమయ్యారు. కుమార్తెకు పెళ్లి చేసే బాధ్యత ఉండటంతో చావు నిర్ణయం తీసుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుల వారి నుంచి, పోలీసులు, కుమారుడి నుంచి రక్షణ కల్పించి న్యాయం చేయాలని వేడుకున్నారు. ఇందుకు ఆర్డీఓ కేశవనా యుడు స్పందించారు. ఈ విషయంపై స్థానికంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. తాను ఈవిషయాన్ని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

### స్కూళ్లలో వేడుకగా కిసాన్ దివస్

అనంతపురం విద్య, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు స్కూళ్లలో కిసాన్ దివస్‌ను వేడుకగా నిర్వహించారు. దేశానికి రైతులే వెన్నెముకని, వారిని మరువరాదని కరస్పాం డెంట్లు విద్యార్థులకు సూచించారు.నగరంలోని హౌసింగ్‌బోర్డు, కోర్టు రోడ్డులో ఉన్న శ్రీచైతన్య స్కూళ్లలో ఘనంగా నిర్వహించారు. ఏజీఎం సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతులను ఆహ్వానించి స్కూల్ ఆవరణలోనే కేక్ కట్ చేసి, వాళ్లకు తినిపించారు. తర్వాత అన్నదాతలకు శాలువలు కప్పి ఘనంగా సన్మానించా రు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాళ్లు సమీన ఖాన్, తబస్సుమ్, వైస్ ప్రిన్సిపాల్ షమీనా, ఏవో గోపాల్, అకడమిక్ కో-ఆర్డినేటర్లు, డీన్లు పాల్గొన్నారు. అశోక్ నగర్‌లోని మినర్వా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా కిసాన్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు రైతుల వేషధారణలో హాజరై ఆకట్టుకున్నారు. దేశంలో అన్నదాతల విశిష్టతను కరస్పాండెంట్ విద్యార్థులకు వివరించారు.


శ్రీచైతన్యలో రైతులను సన్మానిస్తున్న ఏజీఎం


మినర్వాలో రైతుల వేషధారణలో విద్యార్థులు

### కూటమి పాలనపై ప్రజల్లో హర్షం

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్


స్థానిక మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. 'మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సోమవారం స్థానిక 23వ డివిజన్‌లోని ఫెర్రర్ నగర్‌లో కార్పొరేటర్ హరిత, టీడీపీ నాయకులు, అధికారులతో కలిసి పర్యటించారు. ఇళ్ల స్థలాల మంజూరు, ఇళ్ల నిర్మాణాలు, డ్రైనేజీ, వీధి లైట్ల సమస్యలను స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### అన్ని వర్గాలపై భారం

● విద్యుత్ చార్జీల పెంపుపై 27న పోరుబాట: అనంత

అనంతపురం క్రైం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చాక ఆర్నెల్లలో కరెంట్ చార్జీల రూపంలో ఏకంగా రూ. 15,485 కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి విమర్శించారు. కరెంట్ చార్జీల బాదుడుపై వైసీపీ పోరుబాట పోస్టర్లను సోమవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనంత వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ముఖ్య మంత్రి చంద్రబాబు విఫలమయ్యారన్నారు. ఈ నెల 27వ తేదీన జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో కరెంట్ చార్జీల బాదుడుపై వైసీపీ పోరుబాట కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. నగరంలో బ్రహ్మంగారి గుడి నుంచి పవర్‌ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ గిరజమ్మ, మాజీ ఎంపీ రంగయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

### రూ. లక్షల్లో నిధుల దుర్వినియోగం

బుక్కరాయసముద్రం, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): మండలం లో 2023-24 సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనుల్లో రూ.లక్షల్లో నిధులు దుర్వినియోగం అయినట్లు ప్రజావేదికలో సామాజిక తనిఖీ బృందం సభ్యులు వెల్లడించారు. 2023 - 24లో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. డ్వామా అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి, ఏపీడీ అనూరాధ, ఎంపీడీఓ సాల్మాన్ రాజ్ హాజరయ్యారు. మండలపరిధిలోని 19 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు పది రోజులు తనిఖీ చేసి, ఏపీడీకి నివేదిక ఇచ్చారు. 2023లో రూ.11. 54కోట్లతో ఉపాధి పనులు చేపట్టారు. చేసిన పనులకు సంబంధించి సరైన కొలతులు లేవని, చేసిన పనులే తిరిగి చేశారని, ఇంకు డు గుంతలు నిర్మించకుండా బిల్లులు చేసినట్లు గుర్తించినట్లు వెల్లడించారు. దయ్యాలకుంటపల్లిలో రూ. 68 లక్షలతో పలు పను లు చేపట్టగా రూ. 12 లక్షల నిధులు, కొర్రపాడులో రూ.12లక్షలు, బుక్కరాయసముద్రం పంచాయతీలో రూ.20 లక్షలతో పాటు పలు గ్రామ పంచాయతీల్లో నిధులు దుర్వినియోగం అయినట్లు వెల్లడించారు. వాటి రికవరీకి ఏపీడీ ఆదేశాలు ఇచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రజావేదిక కొనసాగింది. మొత్తం ఎంత దుర్వినియోగం అయిందన్న వివరాలు పూర్తిగా తెలియాల్సింది.

### 'అన్నదాతల అణచివేత చర్యలు దుర్మార్గం'

అనంతపురం విద్య, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతుల సమస్యలు పరిష్కరించకుండా వారిపై అణచివేత ధోరణితో వ్యవహరించడం దుర్మార్గమని రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు మండిపడ్డారు. జాతీయ వ్యవసా య మార్కెట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ... కమిటీ నాయకులు సోమవారం నిరసన తెలిపారు. స్థానిక కృష్ణ కళామందిర్ నుంచి క్లాక్‌టవర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ప్రైవేటీకరణ జీవో కాపీలను దహనం చేశారు.

### సహకార సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

అనంతపురం అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాథమిక గొర్రెల పెంపక సహకార సంఘాల ఎన్నికలకు పశుసవర్థక శాఖ అధికారులు సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. జిల్లాలోని 121 ప్రాథమిక గొర్రెల పెంపక సహకార సంఘాల పాలక వర్గం ఎన్నికలను 4 విడతలుగా నిర్వహించాలని నిర్ణయించారు. తొలి విడత జనవరి 7న 36 సంఘాలకు, రెండో విడతలో 18న 36 సంఘాలకు, మూడో విడతలో 25న 35 సంఘాలకు, నాలుగో విడతలో ఫిబ్రవరి 2న 14 సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఆయా సంఘం సభ్యులు ఒక్కో సంఘంలో ఏడుగురు పాలక వర్గ సభ్యులను ఎన్నుకుంటారు. వీరిలో అధ్యక్ష, ఉపాధ్యక్షుడిని ఎంపిక చేసుకుంటారు.

### ఘనంగా కనకదాస జయంతి వేడుకలు


కనకదాస చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రామగిరి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కానుగలకుంట గ్రామంలో సోమవారం కనకదాస జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కురుబ కులస్థులు గురవ య్యల నృత్యాలతో ఇంటింటి నుంచి కలశాలను ఊరేగింపుగా మోసుకొచ్చారు. కనకదాస చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గురవయ్యలతో పాలు పోయించే కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధ లతో నిర్వహించారు. అన్నదానం చేశారు. కనకదాసను ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని పెద్దలు పేర్కొన్నారు.

### అబాకస్‌లో శింగనమల విద్యార్థుల ప్రతిభ

శింగనమల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి అబాకస్ పోటీల్లో శింగనమల ఏఎస్ఆర్ పాఠశాల విద్యార్థులు ఇద్దరు ప్రతిభ చూపిన ట్లు పాఠశాల యాజమా న్యం తెలిపింది. అనం తపురంలో సోమవారం విశ్వం ఎడ్యుటెక్ సంస్థ జోనల్ మేనేజర్ శివాంజనేయులు, ట్రైనర్స్ అంజనేయులు, కబీర్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. స్టార్ సీనియర్స్ విజువైలైజేషన్ విభాగంలో ఏఎస్ఆర్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న భూమా రవికుమార్ మెదటి బహుమతి సాధించాడు. స్టార్ జూనియర్స్ విభాగంలో రెండో తరగతి విద్యార్థి ని భాగ్యోదయ మెదటి బహుమతి సాధించింది. పాఠశాల యాజమాన్యం అంజనేయరెడ్డి తదితరులు అభినందించారు.

### ఖోఖోలో సీవీ రామన్ విద్యార్థుల సత్తా

అనంతపురం విద్య, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ - 19 ఖోఖో పోటీల్లో స్థానిక సీవీ రామన్ కళాశాల విద్యార్థులు సత్తా చాటినట్టు కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆ విద్యార్థులను సోమవారం కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈ నెల 20, 21, 22 తేదీల్లో చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి, మూడో స్థానంలో నిలి చారన్నారు. విద్యార్థినులు మమత, సునిత, మౌనిక, గాయత్రి, కీర్తి, భవాని జిల్లాకు మంచి పేరు తెచ్చారన్నారు. కళాశాల సీఈఓ నరసింహ, ఏఓ నారాయియణరెడ్డి, ప్రిన్సిపాల్ ధనుంజయ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా..

## విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలి

గుంతకల్లు టౌన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపడం అన్యాయని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి బీ సురేష్ పేర్కొన్నారు. స్థానిక ఆలూరు రోడ్డులోని విద్యుత్ కార్యాలయం వద్ద సోమవారం ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీల భారం ప్రజల మీద మోపమని, సమీక్షించి చార్జీలను తగ్గిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తరువాత హామీ నెరవేర్చకుండా ప్రజలపై విద్యుత్ భారం మోపారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజలపై మోపిన చార్జీల భారాన్ని, స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఈకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, జిలాన్, సత్తార్, మోమన్‌నాయక్, నారాయణ, రామదాసు, షెక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడిగా మహేంద్ర

గుంతకల్లుటౌన్, డిసెంబరు 23ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ గుంతకల్లు పట్టణ అధ్యక్షుడిగా ఎం మహేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు అనంతపురంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గాలిమల్లికార్జున, ఆలం నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నెలగొండలో ఉచిత వైద్య శిబిరం


ఎమ్మెల్యేకు బీపీ చెక్ చేస్తున్న వైద్యులు

గుంతకల్లు టౌన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలగొండలో సోమవారం నారాయణ చారిటబుల్ ట్రస్టు వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. అనంతరం వైద్యులు పత్తి హిమబిందు, రఘురాములు నాయక్, రమణా నాయక్ 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, ఎంపీపీ మాధవి, టీడీపీ నాయకులు తలారిమస్తానప్ప, జనసేన నాయకుడు మణికంఠ, ఆ ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు నారాయణనాయక్, కృష్ణానాయక్ పాల్గొన్నారు.

## పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని ఎంపీకి విన్నపం


ఎంపీతో మాట్లాడుతున్న పుల్లారెడ్డి

పుట్లూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో తాగు, సాగునీటి పైపులైను ఏర్పాటు చేయాలని టీడీపీ మండల నాయకుడు పుట్లూరు పుల్లారెడ్డి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు విన్నవించారు. అనంతపురంలో సోమవారం ఆయన ఎంపీని కలిసి మాట్లాడారు. గండికోట ప్రాజెక్టు నుంచి 85 నిట్టూరు వరకు నీరు వస్తోందని, అక్కడి నుంచి పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులకు పైప్‌లైన్ ద్వారా నీటిని మోటార్ల ద్వారా పంపింగ్ చేయవచ్చునని అన్నారు. ఈ పైప్‌లైను ఏర్పాటు అయితే మండలంలోని 8గ్రామాల ప్రజలకు తాగు, సాగునీటికి ఇబ్బందులు ఉండవని వివరించారు. ఇందుకు ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. నాయకులు రామాంజనేయులు, తేజ, మల్లికార్జునరెడ్డి, నరసింహ, జీవన్‌కుమార్, ఉమామహేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప మాలధారులకు భిక్ష


భిక్షలో పాల్గొన్నఅయ్యప్ప మాలధారులు

విడపనకల్లు, డిసెంబ రు 23(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ పట్టణంలో సోమవారం అయ్యప్ప మాలధారులకు పోలీసులు భిక్ష ఏర్పాటు చేశారు. సీఐ చి న్న గౌస్, ఏఎస్ఐ గురికాల శివప్రసాద్ తదితరులు మధ్యాహ్న సమయంలో మాలధారులకు భిక్ష ఏర్పా టు చేశారు. తొలుత మాలధారులు స్థానిక అయ్యప్ప ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సీఐను పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సౌత్‌జోన్ ఖోఖోపోటీలకు ఎంపిక


పవిత్ర

గుంతకల్లుటౌన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ రెండవ చదువుతున్న బీ పవిత్ర సౌత్‌జోన్ ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య సోమవారం తెలిపారు. ఖోఖో విభాగంలో యూనివర్శిటీ స్థాయిలో ప్రతిభ కనబరిచి సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైందన్నారు. కేరళలోని కాలికట్‌లో ఈనెల 27నుంచి 31 వరకు జరిగే సౌత్‌పోటీలో పాల్గొంటుందన్నారు. పవిత్రను పీడీ సురేష్, అధ్యాపకులు సోమవారం అభినందించారు.

## వంద లీటర్ల నాటుసారా స్వాధీనం

గుంతకల్లుటౌన్, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): కసాపురం గ్రామ సమీపంలోని నంచర్ల క్రాస్ వద్ద సోమవారం నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ శివసాగర్ సోమవారం తెలిపారు. గుంతకల్లు నుంచి మద్దికెరకు ఆటోలో నాటుసారా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో వెంటనే సిబ్బందితో నంచర్ల క్రాస్ వద్ద దాడులు నిర్వహించామన్నారు. ఇందులో వంద లీటర్ల నాటుసారా, బజాజ్ ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. దాడుల్లో ఎస్ఐ వెంకటేశం, సిబ్బంది పాల్గొన్నారు.

## సెల్ ఉంటే చాలు..!

● ప్రజా సమస్యలతో పనేమి?

● గ్రీవెన్స్‌లో సెల్‌ఫోన్‌తో అధికారుల కాలక్షేపం


పరిష్కారవేదికలో సెల్‌ఫోన్ చూడటంలో నిమగ్నమైన అధికారులు

యల్లనూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులంతా సెల్‌ఫోన్‌లో నిమగ్నమవడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలోనైనా సమస్యలు చెబుదామని వస్తే అధికారులంతా సెల్‌ఫోన్‌లో మునిగిపోతే ఇంక మా సమస్యలు ఏం వింటారని వారు ప్రశ్నిస్తున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన తహసీల్దార్ రాజా మొదలు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజామణి, ఏపీఎం ముత్యాలప్ప, ఏఓ రామకృష్ణలు సెల్‌ఫోన్ చూస్తూ కాలక్షేపం చేశారు. వీరు ఇలా ఉంటే అర్జీలు ఇచ్చినప్పటికి సమస్యలు పరిష్కారం కావడం లేదని, ఇంక అర్జీలు ఇచ్చి ఏమి ప్రయోజనమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.


వద్రవన్నూరు పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్

# నిరుపయోగంగా ఆర్వో ప్లాంట్లు


జుంజురంపల్లి పాఠశాలలో బాటిళ్లలో నీటిని తెచ్చుకున్న విద్యార్థులు

● ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులకు గురై పని చేయని వైనం

● తాగునీటికి ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

రాయదుర్గంరూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి కష్టాలు తీర్చేందుకు నాడు - నేడు పథకం కింద 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ. లక్షలు వెచ్చించి నాటి ప్రభుత్వం కొన్ని పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు (నీటిశుద్ధి యంత్రాలు)ను ఏర్పాటు చేసింది. ఆ ప్లాంట్లు మూడు నెలల పాటు పనిచేసి.. తర్వాత చెడిపోయాయి. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి.

మండలంలో 39 ప్రభుత్వ పాఠశాలలు 6044 మంది విద్యార్థులు ఉన్నారు. మండలంలో ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు గాను పల్లేపల్లి, టీ వీరాపురం ఉన్నత పాఠశాలలకు మాత్రమే ఆర్వోప్లాంట్లు మంజూరయ్యాయి. అలాగే ఏడు ప్రాథమికోన్నత పాఠశాలలకు మంజూరయ్యాయి. ఇక 24 ప్రాథమిక పాఠశాలలకుగాను పది పాఠశాలలకు ఆర్వోప్లాంట్లు మంజూరయ్యాయి. మొత్తం 19 పాఠశాలలకు నాడు - నేడు కింద రూ. 26.98 లక్షలను ఖర్చు చేసి ఆర్వోప్లాంట్లు ఏర్పాటు చేశారు. కాగా అవి పని చేయకపోవడంతో పాఠశాలల్లో విద్యార్థులు భోజనం తిన్న తర్వాత తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేసేది లేక ఇంటి వద్ద నుంచి బాటిళ్లలో తాగునీటిని తెచ్చుకుంటున్నారు. ఉపాధ్యాయులు పలుసార్లు ఆర్వోప్లాంట్ల మరమ్మతులకు కాంట్రాక్టర్లకు సమాచారం అందించినా స్పందన లేకపోవడంతో పిల్లలకు నీటి కష్టాలు తప్పడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆర్వోప్లాంట్లను మరమ్మతులు చేయించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

### మరమ్మతులు చేపట్టాలి



ప్రభుత్వ పాఠశా లలో విద్యార్థుల కు తాగునీరు తీర్చేం దుకు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ మరమ్మతులను వెంటనే చేపట్టాలి. రూ. లక్షలు వెచ్చించి పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు చేడిపోవడంతో తాగునీరులేక విద్యార్థులు ఇబ్బం దులు పడుతున్నారు.

- బంగి శివ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు

### అందని ద్రాక్షలా



గత ప్రభుత్వ హయాంలో నాడు - నేడు పనుల కింద ప్రతి పాఠశాలలో విద్యార్థులకు తాగునీటిని అందించేందుకు ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసినప్పటికీ మరమ్మతులకు నోచుకోకపోవడంతో అందని ద్రాక్షలా మారింది. విద్యార్థులకు తాగేందుకు నీటిని ఇంటి వద్ద నుంచి బాటిళ్లలో తీసుకొచ్చి కాలం వెల్లదీస్తున్నారు. అధికారులు మాత్రం వాటిని పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్వోప్లాంట్లను మరమ్మతులు చేయించాలి.

- అంజనేయులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి

### పలుమార్లు ఫిర్యాదు చేశా

ప్రభుత్వ పాఠశాలలో 2020-21 ఆర్థిక సంవత్సరంలో నాడు - నేడు కింద మండలంలో 19 పాఠశాలలో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఆర్వో ప్లాంట్లు మరమ్మతుల విషయంపై పాఠశాల ఉపాధ్యాయులు పలుమార్లు కంపెనీ యజమానులకు ఫిర్యాదు చేశారు. మరొకసారి కంపెనీ యజమానులతో మాట్లాడి ఆర్వోప్లాంట్లను మరమ్మతులు చేయిస్తాం. తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

- నాగమణి, ఎంఈఓ

## రేపు ఆరాధనోత్సవాలు


నారాయణార్యారుఢ మూల విరాట్

బెళుగుప్ప, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని విరుపాపల్లిలో ఈ నెల 25వ తేదీన సద్గురు నారాయణార్యారుఢ స్వామి 51వ ఆరాధనా మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామస్థులు, భక్తులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామికి వేదపండితుల చేత రుద్రాభిషేకం, బిల్వార్చన, మహామంగళహారతి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. సాయంత్రం రథోత్సవం, రాత్రి భజనపోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మార్తాడు మఠాధ్యక్షుడు జ్ఞానమూర్తి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరగనున్నాయని అన్నారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని గ్రామస్థులు కోరారు.

## గ్రీవెన్స్‌కు అధికారులందరూ హాజరు


గ్రీవెన్స్‌లో పాల్గొన్న అధికారులు

శెట్టూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేది క కార్యక్రమానికి (గ్రీవెన్స్) అధికారులు తరచూ గైర్హాజరవుతుండడంపై గత వారం ఆంధ్రజ్యోతిలో ఆంధ్రజ్యోతి స్పందన స్పందనకు అధికారుల డుమ్మా అనే శీర్షిక కథనం ప్రచురింతమైంది. దీంతో ఈ వారం జరిగిన గ్రీవెన్స్‌కు మండల స్థాయి అధికారులందరూ సమయానికి హాజరయ్యారు. తహసీల్దార్, ఐసీడీఎస్, వైద్యశాఖ, ఎంఈవో, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులందరూ హాజరయ్యారు. ఇందులో మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు పలు సమస్యల పరిష్కరించాలని కోరుతూ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

## వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తిరూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) :మండలంలోని పీ. యర్రగుడి గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన రఘురామిరెడ్డి అనారోగ్య, కుటుంబ సమస్యలతో బాధపడేవాడు. ఈ క్రమంలో సోమవారం తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. బంధువులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## పాఠశాలలో వివాదంపై విచారణ

విడపనకల్లు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం చాబాల జెడ్పీహైస్కూల్లో గత నవంబరులో హెచ్ఎం నాగేంద్రకు, అదే గ్రామానికి చెందిన సొసైటీ అధ్యక్షుడు కేదార్ నాథ్‌కు వాచ్‌మెన్ విషయమై ఘర్షణ జరిగింది. ఈ విషయమై డీఈఓకు ఫిర్యాదు చేయటంతో సోమవారం ఉదయం డిప్యూటీ డీఈఓ శ్రీదేవి పాఠశాలను చేరుకుని ఇరువర్గాలను విచారించారు. ఉపాధ్యాయులు గ్రామస్థులతో ఘర్షణలు పడటం మంచి పద్ధతి కాదన్నారు. పిల్లలు చదువులు నేర్చుకునే పాఠశాలలో ఇలాంటివి ఉండకూడదని హెచ్చరించారు. అనంతరం ఇరువర్గాలను రాజీ చేశారు. ఇక మీదట ఎటువంటి గొడవలు జరగ కుండా చూసుకుంటామని ఇరువురు అంగీకార పత్రాలు రాసి ఇచ్చారు. దీంతో వివాదం సద్దుమనిగింది.

## దళిత మహిళపై దౌర్జన్యం చేస్తున్నారంటూ ఫిర్యాదు

కళ్యాణదుర్గంరూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీటీ ఆస్పత్రి ఎదురుగా దివ్య అనే దళిత మహిళ టీ కొట్టు నడుపుతోందని, కాగా ఆ కొట్టు వెనుక భాగంలో కానిస్టేబుల్ నరసింహకు చెందిన స్థలం ఉందని, అతను గత కొన్ని రోజుల నుంచి టీ కొట్టును తొలగించాలని ఆ మహిళను బెదిరిస్తున్నాడని ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఆర్డీవో వసంత్ బాబుకు సోమవారం ఫిర్యాదు చేశారు. దివ్య టీకొట్టు నడుపుతున్న స్థలం పోరంబోకు స్థలమని, కానిస్టేబుల్ నరసింహకు సంబంధం లేదని తెలిపారు. అయినా మున్సిపల్ అధికారులతో నోటీసులు ఇప్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. టీ కొట్టును తొలగిస్తే ఆమెకు జీవనాధారం పోతుందని తెలిపారు. కానిస్టేబుల్ బారి నుండి కాపాడాలని విన్నవించారు.

## విషపూరిత గ్రాసం తిని ఎనిమిది గొర్రెలు మృతి

కళ్యాణదుర్గంరూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామంలో పురుగుల మందు పిచికారీ చేసిన గడ్డిని తిని ఎనిమిది గొర్రెలు మృతి చెందగా మరో పదింటి పరిస్థితి విషమంగా ఉన్నట్లు బాధితుడు గోవిందప్ప తెలిపారు. రోజులాగే సోమవారం గొర్రెలను మేతకు తీసుకెళ్లానని, మధ్యాహ్నం 3 గంటల సమయంలో దొడగట్ట సమీపంలో గల తోటలో ముల్లంగి తోటలో గ్రాసం తిన్నాయని చెప్పారు. అయితే పంటకు క్రిమి సంహారక మందులు వారం క్రితం పిచికారీ చేయడంతో గ్రాసం విషపూరితంగా ఉందని, దీంతో వాటిని తిని గొర్రెలు మృతి చెందినట్లు తెలిపారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

కళ్యాణదుర్గంరూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోల్డెన్ బెల్స్ ఉన్నత పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏసుక్రీస్తు పుట్టుక గురించి ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ ఫాదర్ జీన్స్, జ్ఞానభారతి విద్యా సంస్థల అధినేత రమేష్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వేడుకలో వివిధ వేషధారణలలో పాల్గొన్న చిన్నారులు

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుత్తి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మన్రో సత్రం సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. గాంధీ నగర్‌కు చెందిన శ్రీరాములు బైక్‌లో ఇంటికి వెళ్తుండగా.. మనో సత్రం వద్ద వెనుక నుంచి ఆటో ఢీకొంది. ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## రూ.30 వేల ఆర్థికసాయం

తాడిపత్రి, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోటరీక్లబ్ కార్యాలయంలో సోమవారం సెమినార్ అప్లాస్టిక్ అనేమియా వ్యాధితో బాధపడుతున్న నాలుగో తరగతి విద్యార్థి రెబల్‌కుమార్‌కు చికిత్స నిమిత్తం రూ.30వేలు ఆర్థికసాయం అందించినట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు వెంకటసుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు రఫీ, కిషోర్‌కుమార్, మద్దిలేటి, సంజన, రమేష్‌బాబు, భరత్, షాకీర్, కుళ్లాయిస్వామి తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థినులకు ప్లేట్లు పంపిణీ

పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు 101 భోజనం ప్లేట్లను అందించినట్లు ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు కౌసర్‌బేగం తెలిపారు. సంస్థ స్థాపించి 101 ఏళ్లు పూర్తయిన సందర్భంగా భోజనం ప్లేట్లను పంపిణీచేశామని చెప్పారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతస్థానాలకు ఎదగాలని ఆమె కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మ, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు ఆయకట్టుదారుల సమావేశం

బ్రహ్మసముద్రం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని భైరవానితిప్ప ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండటంతో నీటిని ఆయకట్టుకు వదిలేందుకు మంగళవారం ప్రాజెక్టు వద్ద సమావేశం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆయకట్టుదారుల సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు హాజరవుతారన్నారు. అలాగే ప్రాజెక్టులోకి ఉచితంగా చేపపిల్లలను వదలనున్నట్లు చెప్పారు. కావున ఆయకట్టుదారులు, చైర్మన్లు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

## ఆ భూమితో సంబంధం లేదు..

విడపనకల్లు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేవాలయ భూమిని ఆక్రమించానని టీడీపీ నాయకులు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని, ఆ భూమితో తనకు ఎలాంటి సంబంధం లేదని మాజీ ఎమ్మెల్యే విశ్వ అనుచరుడు లత్తవరం కురుబ గోవిందు పేర్కొన్నారు. ఉరవకొండ లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సర్వే నంబరు 141లోని 21.05 ఎకరాల భూమికి తనకు ఎటువంటి సంబంధం లేదన్నారు. ఈ భూమి ఉరవకొండ పాండురంగస్వామి, జనార్ధనపల్లి ఆంజనేయస్వామి, జనార్ధనస్వామి, శ్రీరామస్వామి ఆలయాలకు చెందినది కాదన్నారు. ఎక్కడా ఆ ఆలయాలకు ఈనాము ఇచ్చినట్లు రికార్డులు కూడా లేవన్నారు. వజ్రకరూరుకు చెందిన గుండురావు కుమారులతో తన అల్లుడు న్యాయ నిపుణుల సలహాలతో ఎటువంటి తకరార్లు లేవని , ఇది దేవాలయ భూమి కాదని నిర్ధారించుకున్న తరువాతనే కొనుగోలు చేశారని చెప్పారు. ఈ భూమిపై తనకు ఎటువంటి హక్కులు లేవన్నారు. తనపై ఆరోపణలు చేసిన జనార్ధనపల్లి టీడీపీ నాయకులపై పరువు నష్టం దావా కేసును వేస్తామని పేర్కొన్నారు.

## ట్రాఫిక్ సమస్య రాకుండా చూడాలి

బెళుగుప్ప, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నిబంధనలు పాటించి సమస్య లేకుండా చూడాలని ఈవోఆర్డీ నాగేశ్వర శాస్త్రి చిరు వ్యాపారులకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన చిరు వ్యాపారులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. చాలామంది రోడ్డుకు ఇరువైపులా బంకులు వేసుకుని సిమెంట్ రోడ్డును ఆక్రమించుకున్నారన్నారు. నిబంధనలు ప్రకారం సిమెంట్ రోడ్డు నుంచి మూడు అడుగులు వదలి బంకులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇప్పటికైనా నిబంధనలు పాటించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని కోరారు. పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

## అబాకస్‌లో ప్రతిభ

బెళుగుప్ప, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అబాకస్ వేదిక్ మ్యాథ్స్ జోనల్ స్థాయిలో నిర్వహించిన ప్రతిభ పరీక్షలలో మండలకేంద్రంలోని శ్రీనివాస విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థి నితిన్ ప్రతిభ కనబరచినట్లు కరెస్పాండెంట్ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఈ నెల 22వ తేదీ అనంతపురంలో జరిగిన పరీక్షలలో విద్యార్థి పాల్గొని ప్రతిభ కనబరచినట్లు చెప్పారు. ఇందుకు ప్రిన్సిపాల్ సుమ, సిబ్బంది ఆ విద్యార్థిని అభినందించారు.

## రేషన్‌డీలర్లు అందుబాటులో ఉండాలి

బొమ్మనహాళ్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు వినియోగదారులకు అందుబాటులో ఉండి రేషన్ సరుకులను సక్రమంగా అందించాలని తహసీల్దార్ మునివేలు తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనదారులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రతి నెలా 1 నుంచి 18వ తేదీ వరకు ఎండీయూ వాహననిర్వాహకులు తమకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం వినియోగదారులకు సేవలు అందించాలని అన్నారు. ఇష్టం లేనివారు వాహనాలను తమకు అప్పగించి విధుల నుంచి తప్పుకోవచ్చని అన్నారు. డీలర్లు కందిపప్పు కేజీ రూ. 67 కు, చక్కెర అర్ధకేజీ రూ. 17 ల వంతున విక్రయించాలని ఆదేశించారు. ఈఓపీఆర్డీ దాస్, ఆర్ఐ బాలకృష్ణ, డీలర్ల సంఘం మండల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు పయ్యావుల మోహన్, తిప్పేస్వామి, ఆనంద్, ప్రభయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

తాడిపత్రి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీహెచ్ మహల్ థియేటర్ సమీపంలో సోమవారం మద్యం మత్తులో ఘర్షణపడిన సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలు కాగా మరో వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడని పట్టణ పోలీసులు తెలిపారు. స్థానిక గాంధీనగర్‌కు చెందిన బాబాఫక్రుద్దీన్, వెంకటేష్‌తోపాటు మరికొంతమంది మద్యం సేవించారు. అనంతరం ఇంటికి వస్తున్న సమయంలో వారి మధ్య డబ్బుల విషయంలో మాట మాట పెరిగి ఘర్షణ జరిగింది. ఇందులో వెంకటేష్‌కు గొంతు కోయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాబాఫక్రుద్దీన్ తలకు స్వల్పగాయమైంది. చికిత్స నిమిత్తం ఇరువురిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వెంకటేష్‌ను అనంతపురం తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేస్తామని పోలీసులు తెలిపారు.

## రైతులను ఇబ్బంది పెడితే తరిమికొడతాం: టీడీపీ

యాడికి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): చెరువు మట్టి విషయంలో రైతులను ఇబ్బందులకు గురి చేయాలని చూస్తున్న వైసీపీ నాయకులను తరిమి కొడతామని టీడీపీ నాయకులు, రైతులు తెలిపారు. చెరువు మట్టిపై వైసీపీ నాయకులు చేసిన వ్యాఖ్యలపై సోమవారం రాయలచెరువులో టీడీపీ నాయకులు, రైతులు సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాయలచెరువులోని చెరువు మట్టిని తాము సొంత వ్యయంతో టిప్పర్లను ఏర్పాటు చేసుకొని పొలాలకు తోలుకుంటున్నామని తెలిపారు. అధిక ధరలకు ఎరువులు కొనలేక చెరువు మట్టిని తోలుకొని పొలాలను సారవంతం చేసుకుంటున్నామన్నారు. వైసీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు గత ఐదేళ్లకాలంలో చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి చెరువు మట్టి దోపిడి చేస్తున్నారని అంటూ వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఇలా రైతులను ఇబ్బందులకు గురిచేస్తే వైసీపీ నాయకులను తరిమి కొడతామని హెచ్చరించారు. చిన్నపేట ఆంజనేయస్వామిమాన్యం, యాడికి భైరవకొండ తదితర ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టిని తరలించిన వైసీపీ నాయకులు చెరువు మట్టిపై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, నాయకులు శ్యాంసుందర్‌నాయుడు, పరిమి చరణ్, నాగమునిరెడ్డి, త్రినాథ్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, రైతులు నారాయణరెడ్డి, వెంకటసుబ్బయ్య, సుదర్శన్, ప్రభాకర్, కుమార్ పాల్గొన్నారు.

## హెచ్చెల్సీ వంతెనపై రంధ్రం

● యుద్ధ ప్రాతిపదికన పూడ్చేసిన అధికారులు

కణేకల్లు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళేకుర్తికు వెళ్లు రహదారిలో హెచ్చెల్సీ అక్విడెక్ట్ సమీపంలో ఉన్న వంతెనపై పెద్ద రంధ్రం ఏర్పడింది. సోమవారం ఉదయం ఉన్నఫలంగా రంధ్రం ఏర్పడడంతో రాకపోకలు పూర్తిగా స్థంభించిపోయాయి. హెచ్చెల్సీలో నిండుగా నీరు ప్రవహిస్తుండగా వంతెనపై రంధ్రం ఏర్పడడంతో కాలువకు గండి పడుతుందేమోనని ప్రజలు ఆందోళన చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న హెచ్చెల్సీ అధికారులు హుటాహుటిన సంఘటన స్థలాన్ని చేరుకుని యుద్ధప్రాతిపదికన రంధ్రాన్ని పూడ్చివేశారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ డీఈ మద్దిలేటి, జేఈ నరేంద్రమారుతితో పాటు చెరువు సంఘం అధ్యక్షుడు బీటీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కమిటీ హాల్‌ను ఖాళీ చేయాలంటూ నోటీసు

రాయదుర్గంరూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చదంగొల్లలదొడ్డి గ్రామానికి చెందిన వైసీపీ మద్దతు మాజీ సర్పంచ్ ఎర్రప్పకు కమిటీ హాల్ భవనాన్ని ఖాళీ చేయాలంటూ పంచాయతీ కార్యదర్శి అయ్యప్ప సోమవారం నోటీసులు అందజేశారు. గ్రామంలో చాలా సంవత్సరాల నుంచి కమ్యూనిటీ భవనాన్ని మాజీ సర్పంచ్ ఎర్రప్ప సొంత పనులకు వాడుకుంటున్నాడని ఫిర్యాదులు వచ్చాయి. దీంతో కమ్యూనిటీ భవనాన్ని వారంరోజుల్లోగా ఖాళీ చేయాలని ఆయనకు నోటీసులు అందజేశారు. గ్రామంలో ప్రభుత్వానికి సంబంధించిన సమావేశాలు నిర్వహించుటకు కార్యాలయాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్న దృష్ట్యా వారంరోజుల్లోపు కమ్యూనిటీ భవనాన్ని ఖాళీ చేయాలని నోటీసును జారీ చేశారు. లేని పక్షంలో తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## 633 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 633 క్యూసెక్కులు ఉన్నటు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 ఔట్‌ఫ్లో కింద 429 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

## పశువైద్య శిబిరం

కూడేరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరుట్ల-3వ కాలనీలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో పశుసంవర్థక శాఖ జిల్లా కార్యనిర్వాహక అధికారి టీపీ సుధాకర్ ఆవులకు గర్భకోశ చికిత్స నిర్వహించారు. అనంతరం పలు ఆవులకు టీకాలు వేశారు. పైశువైద్యాధికారి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు మరుట్ల రవి రైతులు పాల్గొన్నారు.

## గవి మఠం కమిషనర్ బాధ్యతల స్వీకరణ

విడపనకల్లు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విజయవాడ దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఉరవకొండ గవిమఠం నూతన మేనేజర్, అసిస్టెంట్ కమిషనర్‌గా రాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ మఠం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. గ్రామస్థులు సహకారం అందించాలని కోరారు.